**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 82, పేజీలు - 08

ఆదివారం, సెప్టెంబర్ 20, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




# దానంపై వేటు తీర్పుతో కలకలం

## - మరి మిగతా ఎమ్మెల్యేల పరిస్థితేంటి.?



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)**తెలంగాణ శాసనసభలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై పదో షెడ్యూల్ పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద 2024 ఏప్రిల్ 23వ తేదీ నుంచే అనర్హత వర్తించేలా తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు రాష్ట్ర రాజకీయాల్లో పెద్ద దుమారాన్నే రేపింది. దానం నాగేందర్ పార్టీ మారినట్లుగా ఆధారాలు లేవంటూ స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు రద్దు చేయడంతో, గులాబీ శ్రేణులు పండగ చేసుకుంటున్నాయి. కాంగ్రెస్‌లోకి వెళ్లిన మిగిలిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై కూడా త్వరలోనే ఇదే రీతిలో అనర్హత వేటు పడుతుందని, వారి పదవులు ఊడిపోవడం ఖాయమని బీఆర్ఎస్ నాయకులు సోషల్ మీడియా, మీడియా వేదికగా తీవ్ర ప్రచారం చేస్తున్నారు. అయితే, రాజకీయాలు, చట్టపరమైన అంశాలను లోతుగా పరిశీలిస్తే దానం నాగేందర్ కేసు పూర్తిగా వేరు, మిగిలిన ఎమ్మెల్యేల పరిస్థితి పూర్తిగా వేరు అని స్పష్టమవుతోంది.

### దానం నాగేందర్‌ది స్పెషల్ కేసు

దానం నాగేందర్ చట్టపరమైన ఉచ్చులో చిక్కుకోవడానికి ప్రధాన కారణం ఆయన కాంగ్రెస్ బి-ఫామ్‌పై సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం నుంచి అధికారికంగా పోటీ చేయడమే. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ప్రకారం ఒక పార్టీ నుంచి గెలిచిన ప్రజాప్రతినిధి వేరే పార్టీ తరఫున ప్రత్యక్షంగా ఎన్నికల్లో నామినేషన్ వేసి బి-ఫామ్ సమర్పిస్తే, ఆయన తన మాతృక పార్టీ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా

2లో..

### ఇక భారత్‌పై 100 శాతం

# టారిఫ్ మోత!

## - రష్యా ఆంక్షల చట్టానికి డొనాల్డ్ ట్రంప్ ఆమోదం



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) రష్యా నుంచి చమురు, గ్యాస్ దిగుమతులపై అమెరికా ఆంక్షలు మరింత కఠినతరం చేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సెప్టెంబర్ 18న 'సాంక్షనింగ్ రష్యా యాక్ట్ 2026'పై సంతకం చేయడంతో కొత్త చట్టానికి ఆమోదం లభించింది. ఉక్రెయిన్‌పై దాడులకు రష్యాకు వెళ్లే నిధులను ఆపడం ఈ చట్టం ముఖ్య ఉద్దేశం. రష్యాపై ఈ కఠిన ఆంక్షల బిల్లుకు ఆమోదం లభించడంతో భారత్, చైనా వంటి దేశాలపై

2లో..

### ఇది ప్రకృతి కరవు కాదు,

# కాంగ్రెస్ తెచ్చిన కరవు

- శ్రీశైలం నుంచి 84 టీఎంసీలు వాడామన్నది పచ్చి అబద్ధం
- రాష్ట్ర చరిత్రలోనే ఈ ఏడాది అత్యల్పంగా కృష్ణా జలాల వినియోగం
- నీళ్లు, మోటార్లు ఉన్నా ప్రభుత్వం వాడుకోలేకపోయిందని విమర్శ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) అసెంబ్లీలో రాష్ట్రంలో నెలకొన్న సాగునీటి, విద్యుత్ కష్టాలపై కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలేనని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు అన్నారు.ప్రకృతి వైపరీత్యం ఎల్‌నినో వల్లే కరువు వచ్చిందని ప్రభుత్వం చేతులెత్తేయడాన్ని ఆయన తప్పుబట్టారు. ఈరోజు తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ ఆధారాలతో సహా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు.'రాష్ట్ర సాధనలో కేసీఆర్‌తో కలిసి పోరాడిన ఉద్యమకారుడిగా, 24 ఏళ్లుగా అసెంబ్లీలో ఉన్న సీనియర్ సభ్యుడిగా, రైతు బిడ్డగా నాకిది రాజకీయం కాదు బాధ్యత. ప్రజల ఇబ్బందుల మీద బాధ్యతతో మాట్లాడుతున్నా'అని హరీశ్ రావు చెప్పుకొచ్చారు.'ఇది కాలం తెచ్చిన కరువు కాదు, కాంగ్రెస్ పార్టీ తెచ్చిన కరువు..

2లో..

### సుప్రీంకోర్టుకెక్కిన

## దానం నాగేందర్

- తన అనర్హతను సవాల్ చేస్తూ స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా ఉన్న దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. శనివారం మధ్యాహ్నం అత్యున్నత న్యాయస్థానంలో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ) దాఖలు చేశారు. దీంతో ఇప్పుడు దానం

2లో..

### ప్రతి మనిషికి సొంతిల్లు

# ఉండాలనేది కల

## - విశాఖలో 28,445 కుటుంబాలకు ఇళ్ల పట్టాల పంపిణీ

- మీ ఇంటిపై సర్వ హక్కులు మీవేనని సీఎం చంద్రబాబు భరోసా
- విశాఖను విశ్వనగరంగా తీర్చిదిద్దుతామని భారీ ప్రకటన
- గోదావరి జలాలతో నగర నీటి కష్టాలు శాశ్వతంగా తీరుస్తామని హామీ
- గత ప్రభుత్వ పాలనలో భూ కబ్జాలు, కూల్చివేతలపై తీవ్ర విమర్శలు



**విశాఖపట్నం (ప్రశ్న న్యూస్)** విశాఖ నగరంలోని వేలాది పేద కుటుంబాల దశాబ్దాల కల నెరవేరింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమం ద్వారా 28,445 కుటుంబాలకు వారు నివసిస్తున్న ఇళ్లపై సర్వ హక్కులు కల్పిస్తూ పట్టాలు పంపిణీ చేశారు. శనివారం విశాఖలో జరిగిన సభలో ఆయన లబ్ధిదారులకు కన్వీనియన్స్

2లో..




# అక్టోబర్ 1న కరవు మండలాలను ప్రకటించండి

## - వర్షాభావ పరిస్థితులపై సీఎం ఉన్నతస్థాయి సమీక్ష



అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను శాస్త్రీయంగా అంచనా వేసి, అక్టోబర్ 1న కరవు మండలాలను అధికారికంగా ప్రకటించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఎక్కడా పంట నష్టం జరగకుండా, తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పటిష్ఠమైన ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. కరవు పరిస్థితులపై ప్రతీ నెలా కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు పంపించాలని నిర్దేశించారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు, వ్యవసాయ-ఉద్యాన పంటల పరిస్థితి, రైతుల ఇబ్బందులు, తాగునీటి సరఫరా తదితర అంశాలపై శనివారం తన క్యాంపు కార్యాలయంలో

3లో..

# సర్కార్ బడి పిల్లలకు 'కొత్త లుక్'

- ఆకర్షణీయమైన రంగులు, వైవిధ్యమైన డిజైన్లతో యూనిఫాంలు
- వచ్చే ఏడాది తొలిరోజే యూనిఫాం, సామగ్రి అందేలా ప్రణాళిక
- అదనంగా 10 శాతం విద్యార్థులు చేరే అవకాశం
- ముందస్తు ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశం





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల యూనిఫాంలను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. యూనిఫాం రంగుల్లో కొత్తదనంతో పాటు డిజైన్లలోనూ వైవిధ్యం ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థులకు అందిస్తున్న యూనిఫాంలు, నోటు పుస్తకాలు, ఇతర సామగ్రి పంపిణీపై సీఎం సమీక్ష నిర్వహించారు.

### నెలాఖరులోగా రెండో జత యూనిఫాం

ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ పాఠశాలలు,

3లో..

### అట్టహాసంగా

# ఆసియా క్రీడలు ప్రారంభం

## - భారత అథ్లెట్లకు ప్రధాని మోదీ విషెస్



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఆసియా ఖండంలోనే అతిపెద్ద క్రీడా సంబరం మొదలైంది. జపాన్‌లోని ఐచీ-నగోయా నగరాలు వేదికగా 20వ ఆసియా క్రీడలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. నగోయాలోని మిజుహో పార్క్ అథ్లెటిక్ స్టేడియంలో జరిగిన అట్టహాస వేడుకలో జపాన్ చక్రవర్తి నరుహిటో ఈ క్రీడలను అధికారికంగా

2లో..

### పార్టీ ఫిరాయింపులను

# ప్రోత్సహించింది కేసీఆరే

## - ప్రభుత్వాలను కూల్చివేయడం బీజేపీకి అలవాటుగా మారిందని ఆగ్రహం

2లో..



# ఎర్రవల్లి భూముల సర్వేలో మరో ట్విస్ట్

## - 180 ఎకరాలు మావేనంటున్న వెంకటాపూర్ రైతులు!



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఎర్రవల్లి భూముల వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫామ్‌హౌస్ సమీపంలోని భూములపై రెవెన్యూ అధికారులు చేపట్టిన సర్వే కొనసాగుతున్న వేళ తాజాగా శివారు వెంకటాపూర్ గ్రామస్థులు కొత్త డిమాండ్‌ను తెరపైకి తీసుకొచ్చారు. సర్వే నంబర్ 325లో ఉన్న మొత్తం 388 ఎకరాల్లో తమ గ్రామానికి చెందిన భూములు కూడా ఉన్నాయని వారు చెబుతున్నారు. ఇందులో సుమారు 180 ఎకరాలు వెంకటాపూర్‌కు చెందినవేనని గ్రామస్థులు వాదిస్తున్నారు. మర్కుక్ మండలం ఎర్రవల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 325లో సుమారు 388 ఎకరాల భూముల హద్దులు, రికార్డులను రెవెన్యూ అధికారులు పరిశీలిస్తున్నారు.

3లో..

# ప్రతి మనిషికి సొంతిళ్లు ఉండాలనేది కల

డీడ్స్ అందజేశారు. ఈ నిర్ణయంతో వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపామని అన్నారు. వేలాది కుటుంబాల దశాబ్దాల కల సాకారమైన వేళ వారి ముఖాల్లో వెల్లివిరిసిన ఆనందాన్ని చూసి, "మీ ముఖాల్లో ఈ ఆనందం చూస్తే నా జీవితం ధన్యమైంది. నా ప్రాణం ఉన్నంతవరకు ఈ క్షణాన్ని గుర్తుపెట్టుకుంటాను" అంటూ చంద్రబాబు భావోద్వేగంతో ప్రసంగించారు. ఇది కేవలం పట్టాల పంపిణీ కాదని, పేద ప్రజల ఆత్మగౌరవానికి, వారి పిల్లల భవిష్యత్తుకు చేస్తున్న పట్టాభిషేకం అని ఆయన అభివర్ణించారు.

## దశాబ్దాల నిరీక్షణకు తెర.. సర్వ హక్కులు మీవే!

"కూడు, గూడు, గుడ్డ అనేది మా విధానం. 40 ఏళ్ల క్రితమే ఎన్టీఆర్ పేదలకు పక్కా ఇళ్లు ఇవ్వాలని సంకల్పిస్తే, అదే స్ఫూర్తితో మేము పనిచేస్తున్నాం" అని చంద్రబాబు గుర్తుచేశారు. దశాబ్దాలుగా సొంత కష్టార్జితంతో నిర్మించుకున్న ఇళ్లలో నివసిస్తున్నా, వాటిపై పూర్తి హక్కు లేదనే వేదనతో జీవిస్తున్న లక్షలాది మందికి ఈ పట్టాభిషేకం ద్వారా విముక్తి కల్పించామన్నారు."నిన్నటి వరకు మీ ఇంటిపై మీకు హక్కు లేదు. కానీ ఈరోజు నుంచి మీ ఇంటి మీద సర్వ హక్కులు మీవే. ఇకపై అనుమానం లేదు, వివాదం లేదు, భయం లేదు. తిరుగులేని హక్కు మాత్రమే ఉంటుంది" అని ఆయన భరోసా ఇచ్చారు. విశాఖ నగర పరిధిలోని గాజువాక, పెందుర్తి, భీమిలి, గోపాలపట్నం సహా 111 మండలాల్లోని 399 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న 19.33 లక్షల చదరపు గజాల భూమిని క్రమబద్ధీకరించి, రూ. 8,874 కోట్ల రిజిస్ట్రేషన్ విలువైన ఆస్తిని ప్రజలకు అప్పగించామని తెలిపారు. "నిన్నటి వరకు అప్పు కావాలంటే గ్యారెంటీ లేని మీరు, ఈరోజు ఈ ప్రభుత్వం ఇచ్చిన పట్టాతో ఏ బ్యాంకులోనైనా స్వేచ్ఛగా రుణం పొందవచ్చు" అని ఆయన స్పష్టం చేశారు.

## మిగిలిన వారికీ త్వరలోనే పట్టాలు.. అధికారులకు ఆదేశాలు

ఈ కార్యక్రమంతోనే ఆగమని, వివిధ కారణాలతో ఆగిపోయిన మరో 35 కాలనీల్లోని 10,000 కుటుంబాలకు, వివాదాల్లో ఉన్న పంచగ్రామాల పరిధిలోని 12,149 మందికి కూడా త్వరలోనే పట్టాలు అందించి శాశ్వత హక్కులు కల్పిస్తామని చంద్రబాబు సభాముఖంగా హామీ ఇచ్చారు. "దేవాలయ భూముల వివాదాలను కోర్టుల ద్వారా పరిష్కరించి, వీలైనంత తొందరగా మీ అందరికీ న్యాయం చేసే బాధ్యత ఈ ప్రభుత్వం తీసుకుంటుంది" అని ఆయన కలెక్టర్‌కు వేదిక నుంచే ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న ప్రతి పేదవాడికీ హక్కు పత్రాలు అందించి, వారి ఆత్మగౌరవాన్ని కాపాడటమే తమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

## దాన్ని నిర్వహించాలంటే ఏనుగును మేపినట్టే!

గత ఐదేళ్ల పాలనపై చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "గత ఐదేళ్లు ఒక పీడకల. రూ.10 లక్షల కోట్ల అప్పులు, ఎక్కడ చూసినా కుంభకోణాలు, భూకబ్జాలు, కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారు. ప్రశాంతమైన ఉత్తరాంధ్రలో అలజడి సృష్టించారు. శుక్రవారం వచ్చిందంటే ఏ ఇంటిని కూలుస్తారో తెలియని భయానక వాతావరణం ఉండేది" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "విశాఖను రాజధాని చేస్తామంటూనే, రుషికొండపై ఋషులు తపస్సు చేసిన చోట ప్యాలెస్‌లు కట్టుకున్నారు. ఆ ప్యాలెస్‌ను ఏం చేయాలో కూడా అర్థం కాని దుస్థితిలో మేమున్నాం. దాన్ని నిర్వహించాలంటే ఏనుగును మేపినంత ఖర్చు అవుతుంది" అని ఎద్దేవా చేశారు. "నాడు కబ్జాలు, కూల్చివేతలు ఉంటే.. నేడు హక్కులు, భరోసా ఇస్తున్నాం. విధ్వంసం నుంచి వికాసం వైపు, భయం నుంచి భరోసా వైపు, నిరాశ నుంచి కొత్త ఆశల వైపు రాష్ట్రాన్ని నడిపిస్తున్నాం" అని ఆయన ఉద్ఘాటించారు.

## విశాఖ ఇక విశ్వనగరం.. నీటి సమస్యకు ఎన్డీయే గ్యారెంటీ!

విశాఖపట్నం భవిష్యత్తుపై చంద్రబాబు స్పష్టమైన దార్శనికతను ఆవిష్కరించారు. "రాబోయే రోజుల్లో విశాఖ ఒక విశ్వనగరంగా మారబోతోంది. ఇది ఇక అన్‌స్టాపబుల్. గూగుల్, రిలయన్స్ డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులతో పాటు అనేక ఐటీ పరిశ్రమలు వస్తున్నాయి. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఒక గేమ్ ఛేంజర్‌గా మారనుంది" అని ఆయన ప్రకటించారు. విశాఖ నీటి సమస్యపై కొందరు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొడుతూ, "ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తగ్గినా, ముందుచూపుతో మేము పూర్తి చేసిన పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి నీళ్లు తెచ్చాం. ఇప్పుడు అదే కాలువను విశాఖ వరకు పొడిగించి, గోదావరి జలాలతో నగర దాహార్తిని శాశ్వతంగా తీర్చే బాధ్యత మా ఎన్డీయే ప్రభుత్వానిది. భవిష్యత్తులో విశాఖకు నీటి కొరత ఉండదు, ఇది మా గ్యారెంటీ" అని చంద్రబాబు గట్టిగా హామీ ఇచ్చారు.

## అభివృద్ధికి అండగా నిలవండి.. 2047 లక్ష్యం మనదే!

పరిశ్రమలు తెచ్చి అవకాశాలు కల్పించడం తమ బాధ్యత అని, వాటిని అందిపుచ్చుకుని యువత ఎదగాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. "విశాఖ ఉక్కును కాపాడింది ఎన్డీయే ప్రభుత్వం. రైల్వే జోన్‌ను రియాలిటీగా మార్చింది మేము. పేదరికం లేని సమాజం, ఆర్థిక అసమానతలు తగ్గడమే మా లక్ష్యం" అని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, 'స్వచ్ఛాంధ్ర'లో భాగస్వాములు కావాలని కోరారు.

"2047 నాటికి 'వికసిత భారత్'తో దేశం ప్రపంచంలో నంబర్ వన్ అవుతుంది.అదే సమయంలో 'స్వర్ణాంధ్ర 2047' లక్ష్యంతో మన రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలుపుతాం. ప్రపంచంలోనే తెలుగు జాతిని అత్యంత శక్తివంతమైన జాతిగా తీర్చిదిద్దే బాధ్యత మనందరిదీ" అని పిలుపునిస్తూ ఆయన తన ప్రసంగాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, నారాయణ, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఇది ప్రకృతి కరవు కాదు, కాంగ్రెస్ తెచ్చిన కరవు

రేవంత్ రెడ్డి తెచ్చిన కరువు. నీళ్లు, కరెంటు రెండు విషయాల్లోనూ తమ తప్పిదాలను ప్రకృతి ఎల్‌నినో పైన నెట్టి చేతులెత్తేయడం బాధ్యతారాహిత్యం'అని మాజీమంత్రి,బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు చెప్పుకొచ్చారు.

## అసెంబ్లీలో పచ్చి అబద్ధాలు

'శ్రీశైలం ప్రాజెక్టు నుంచి ఈ ఏడాది తెలంగాణ 84 టీఎంసీలు వాడుకుందని మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి అసెంబ్లీలో పచ్చి అబద్ధాలు ఆడారు. 84 టీఎంసీలు వాడితే ఆ నీళ్లు ఎక్కడికి పోయాయి? ఏ రిజర్వాయర్ నింపారు? ఏ పొలాలకు ఇచ్చారు? శ్రీశైలం మీద మనకున్నది కల్వకుర్తి, పాలమూరు ఎత్తిపోతల పథకాలు మాత్రమే'అని మాజీమంత్రి,బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు అన్నారు.'కేసీఆర్‌కి పేరు వస్తుందని పాలమూరు మోటార్లను మూడేళ్లుగా పండబెట్టారు. ఇక కల్వకుర్తిలో ఇప్పటివరకు ఎత్తింది కేవలం 8 టీఎంసీలు మాత్రమే.8 టీఎంసీలు ఎత్తి, 84 టీఎంసీలు వాడుకున్నామని ఉత్తం కుమార్ రెడ్డి అబద్ధాలు చెబుతున్నారు. కృష్ణా బేసిన్‌లో గతంలో ఎన్నడూ లేని విధంగా 2024-25లో 286 టీఎంసీల నీటిని వాడామని ఉత్తం చెప్పారు. కానీ సెంట్రల్ వాటర్ కమిషన్ సీడబ్ల్యూసీ అఫీషియల్ రికార్డుల ప్రకారం తెలంగాణ ఏర్పడిన తర్వాత కృష్ణా జలాల వినియోగంలో అత్యంత చెత్త రికార్డ్ ఎవర్ లోవెస్ట్ యూటిలైజేషన్ ఈ మూడేళ్ల కాంగ్రెస్ పాలనలోనే నమోదైంది'అని మాజీమంత్రి హరీశ్ రావు వెల్లడించారు.

## తెలంగాణ వాడింది కేవలం 43 టీఎంసీలే

'నదిలో నీళ్లు వచ్చినప్పుడు 2014 నుంచి 2017 వరకు బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ 31%, 35.8%, 45% దాకా నీటిని వాడుకుంటే 2024-25లో ఆంధ్రప్రదేశ్ 71.5% వాడుకుంది. తెలంగాణ వాడింది కేవలం 28.4%.ఇక ఈ ఏడాది (2025-26) అయితే మరీ ఘోరంగా కేవలం 25% మాత్రమే వాడుకున్నారు. మన వాటా 36% ఉంటే, దాన్ని కూడా వాడుకోలేని దద్దమ్మ ప్రభుత్వం కాంగ్రెస్‌ది'అని మాజీమంత్రి హరీశ్ రావు ఘాటుగా విమర్శలు గుప్పించారు.'ఈ కరువు కాలంలో ఈ ఏడాది ఏపీ 83 టీఎంసీలు వాడుకుంటే, హైదరాబాద్ తాగునీటితో కలిపి తెలంగాణ వాడింది కేవలం 43 టీఎంసీలే. ఇది మీ వైఫల్యం కాదా?'అని మాజీమంత్రి హరీశ్ రావు నిలదీశారు.

## మేడిగడ్డలో కుంగిన బ్లాక్-7 మినహా మిగతా 6 బ్లాకులు సేఫ్

'కల్వకుర్తి ఎత్తిపోతల కింద శ్రీశైలంలో నీళ్లున్నా ఐదు మోటార్లకు గాను ఒకటి, రెండే నడుపుతున్నారు. అది కూడా రోజుకు 10 గంటలే నడుపుతున్నారు.కరెంట్ లేక మోటార్లు నడపక, కేసీఆర్ క్రియేట్ చేసిన 3 లక్షల 16 వేల ఎకరాల ఆయకట్టును ఆగం చేస్తున్నారు.నెట్టెంపాడు, భీమా, కోయిల్ సాగర్, జూరాల కింద దాదాపు 3 లక్షల ఎకరాల పంట ఎండిపోయే ప్రమాదకర స్థితిలో ఉంది. కనీసం కర్ణాటకలోని మీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అడిగి ఆల్మట్టి నుంచి ఒక నెల రోజులు నీళ్లు తెప్పించి పంటలు కాపాడే సోయి మీకు లేదు'అని మాజీమంత్రి హరీశ్ రావు చెప్పుకొచ్చారు.'గోదావరి బేసిన్ విషయానికొస్తే.. అన్నారం, సుందిల్ల, మేడిగడ్డ బ్యారేజీలపై కేంద్ర ప్రభుత్వ సంస్థ సిడబ్ల్యూపిఆర్ఎస్ పూణే అఫీషియల్ రిపోర్ట్ నా దగ్గర ఉంది. రీబౌండ్ హామర్ టెస్ట్, జిపిఆర్, అల్ట్రాసోనిక్ పల్స్ వెలాసిటీ, యూపీవీ వంటి మూడు రకాల టెస్టులు చేశారు.సుందిల్ల, అన్నారంలో 100% కాంక్రీట్ 'వెరీ గుడ్, గుడ్, ఎక్సలెంట్' అని రిపోర్ట్ ఇచ్చారు. మేడిగడ్డలో కూడా కుంగిన బ్లాక్-7 మినహా, మిగతా ఆరు బ్లాకులు సేఫ్ అని తేల్చారు'అని మాజీమంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు.

## రైతుల ఉసురుపోసుకుంటున్నారు

'రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుని నీళ్లు ఎత్తుకోవచ్చని ఎన్డిఎస్ఏ హైకోర్టులో అఫిడవిట్ వేసింది. రిటైర్డ్ ఇంజనీర్లు కూడా మేడిగడ్డ గేట్లు తెరిచి ఉంచి ప్రవాహం ద్వారా నీళ్లు ఎత్తొచ్చని లేఖ రాశారు.అయినా కూడా ఎందుకు మోటార్లు ఆన్ చేయడం లేదు. ప్రజల మీద ఎందుకంత పగ? రిటైర్డ్ ఇంజనీర్లు సలహా ఇస్తే బెల్టుతో కొడతా, జైల్లో పెడతా అని సీఎం రేవంత్ రెడ్డి బెదిరించడం ఆయన అహంకారానికి నిదర్శనం'అంటూ మాజీమంత్రి హరీశ్ రావు మండిపడ్డారు.'ఈ నిమిషానికి కూడా మేడిగడ్డ బ్యారేజ్ వద్ద 46,990 క్యూసెక్కుల ప్రవాహం, రోజుకు 4 టీఎంసీలకు పైగా వృథాగా పోతోంది.బ్యారేజీ గేట్లు తెరిచి ఉన్నా నీటి మట్టం 96 మీటర్లు ఉంది. కన్నేపల్లి పంప్ హౌస్ నడవడానికి కావాల్సిన కనీస మట్టం ఎండిడిఎల్ 93.5 మీటర్లు ఉంటే చాలు.అంటే ఇప్పుడే మోటార్లు ఆన్ చేసి రోజుకు 2 టీఎంసీలు ఎల్లంపల్లికి ఎత్తుకోవచ్చు. కానీ కేసీఆర్ కు పేరు వస్తుందనే రాజకీయ కక్షతో నీళ్లు ఎత్తకుండా రైతుల ఉసురుపోసుకుంటున్నారు'అని మాజీమంత్రి హరీశ్ రావు ధ్వజమెత్తారు.

## దేవాదుల ప్రాజెక్టు విషయంలో నిర్లక్ష్యం

'దేవాదులలో 10 మోటార్లు ఉంటే నాలుగే నడిపారు. బీఆర్ఎస్ పోరాటం చేస్తే కానీ 9 మోటార్లు ఆన్ చేయలేదు.దేవాదుల పంపులకు తక్కువ ప్రవాహంలోనూ నీళ్లు అందుతున్నాయంటే దానికి కారణం కేసీఆర్ కట్టిన సమ్మక్క బ్యారేజ్ కాదా? ఎల్లంపల్లిలో ఈసారి 37 టీఎంసీల ఫ్లడ్ వస్తే కేవలం 6 టీఎంసీలు మాత్రమే ఎత్తి, మిగతా నీళ్లంతా కిందకు వదిలేశారు. ప్యాకేజ్-8 వద్ద రౌండ్ ద క్లాక్ విద్యుత్ ఇచ్చి మోటార్లు నడిపి ఉంటే ఆ నీటిని ఒడిసిపట్టే అవకాశం ఉండేది'అని మాజీమంత్రి హరీశ్ రావు వెల్లడించారు.

## విద్యుత్ రంగంలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు

'కేసీఆర్ ఈ రాష్ట్రాన్ని పవర్ సర్ప్లస్ స్టేట్ గా మార్చి మీ చేతికి ఇస్తే, దాన్ని మీరు సర్వనాశనం చేశారు. రైతులు డీజిల్ జనరేటర్లు పెట్టుకుని రోజుకు 1500 రూపాయలు ఖర్చు చేస్తూ పంటలు కాపాడుకునే దుస్థితి తెచ్చారు. కేంద్ర ప్రభుత్వ వెబ్ సైట్ లెక్కల ప్రకారమే 4000 మెగావాట్లు ఉత్పత్తి కావాల్సిన యాదాద్రి పవర్ ప్లాంట్‌లో బొగ్గు లేక కేవలం 1500 మెగావాట్లే ఉత్పత్తి అవుతోంది'అని మాజీమంత్రి హరీశ్ రావు చెప్పుకొచ్చారు.'భద్రాద్రిలో బాయిలర్ ట్యూబ్ లీక్, ప్రొటెక్షన్ ఇష్యూస్ అని చెప్పి 540 మెగావాట్లు బంద్ పెట్టారు. కొత్తగూడెంలో 800 మెగావాట్లు బంద్ పెట్టారు. దాదాపు 3,300 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని మీ వైఫల్యంతో నిలిపివేశారు.40 వేల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని నా మీద దాడి చేశారు కదా అంత స్టాక్ ఉన్నప్పుడు కరెంట్ ఉత్పత్తి ఎందుకు ఆగిపోయింది?'అని మాజీమంత్రి హరీశ్ రావు నిలదీశారు.

## మా గొంతు నొక్కేందుకే ఏకపక్షంగా సస్పెండ్ చేశారు

'ఎల్‌నినో వస్తుందని ఆరు నెలల ముందే తెలిసినప్పుడు బొగ్గు నిల్వలు పెంచుకుని పవర్ ప్లాంట్లను ఎందుకు సిద్ధం చేసుకోలేదు? కరోనా అనే ప్రకృతి విపత్తు వచ్చినప్పుడు కూడా కేసీఆర్ రైతులకు 24 గంటల కరెంట్ ఇచ్చారు. రెండు పంటలకు రైతుబంధు ఇచ్చారు.ఇక్కడ కరెంట్ ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉండి కూడా రైతులను కరెంట్ కోతలతో గోస పెడుతున్నారు.ఈ వైఫల్యాలన్నింటినీ మేము అసెంబ్లీలో నిలదీస్తామనే భయంతోనే మా గొంతు నొక్కడానికి బీఆర్ఎస్ సభ్యులందరినీ ఏకపక్షంగా సస్పెండ్ చేశారు'అని మాజీమంత్రి హరీశ్ రావు ధ్వజమెత్తారు.

## బురద రాజకీయాలు మాని రైతులకు నీళ్లు, కరెంట్ ఇవ్వండి

'అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై చేసిన వ్యాఖ్యలను నేను ఆన్ రికార్డు వెనక్కి తీసుకున్నా, విచారం వ్యక్తం చేసినా కూడా కుట్రపూరితంగా మమ్మల్ని బయటకు పంపారు.మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి గోబెల్స్ ప్రచారం చేస్తున్నారు.రూ.38,500 కోట్ల కాళేశ్వరం లక్ష కోట్లు ఎట్లా అయిందని పదే పదే మాట్లాడుతున్నారు. ప్రాణహిత-చేవెళ్లలో 16 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంటే కాళేశ్వరంలో అది 37 లక్షలకు పెరిగింది. నీటి నిల్వ సామర్థ్యం 16 టీఎంసీల నుంచి 141 టీఎంసీలకు, వినియోగం 160 నుంచి 240 టీఎంసీలకు పెరిగింది'అని మాజీమంత్రి హరీశ్ రావు చెప్పుకొచ్చారు.'పంపింగ్ సామర్థ్యం రోజుకు 1.8 టీఎంసీల నుంచి 3 టీఎంసీలకు పెరిగింది. నాడు ల్యాండ్ అక్విజిషన్‌కు ఎకరానికి 2 లక్షలు ఇస్తే, మేము 11 నుంచి 13 లక్షలు ఇచ్చాం. అందుకే అంచనాలు పెరిగాయి.కానీ సీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గంలో కడుతున్న కొడంగల్-నారాయణపేట లిఫ్ట్ పరిస్థితి ఏంటి? ఫస్ట్ జీవో 69 ప్రకారం దాని అంచనా 1450 కోట్లు. కానీ పనులు ఏమాత్రం జరగకముందే మొదటి రివిజన్ లో 2945 కోట్లు, రెండో రివిజన్ లో 4725 కోట్లు, థర్డ్ రివిజన్ లో ఏకంగా 6825 కోట్లకు పెంచారు.అంటే లక్ష ఎకరాలకు నీళ్లిచ్చే ప్రాజెక్టు అంచనాలను పని మొదలుకాకముందే ఐదు రెట్లు ఎందుకు పెంచారో ఉత్తం కుమార్ రెడ్డి సమాధానం చెప్పాలి.బురద రాజకీయాలు మాని పరిపాలన మీద, ప్రజలకు కరెంటు, నీళ్లు ఇవ్వడం మీద దృష్టి పెట్టండి.భేషజాలు పక్కనపెట్టి కన్నెపల్లి మోటార్లు ఆన్ చేసి గోదావరి నీళ్లు ఎత్తండి యాదాద్రి, భద్రాద్రిలలో విద్యుత్ ఉత్పత్తి స్టార్ట్ చేసి రైతులకు 24 గంటల కరెంట్ ఇవ్వాలి'అని ప్రభుత్వాన్ని మాజీమంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు.

# అట్టహాసంగా ఆసియా క్రీడలు ప్రారంభం

ప్రారంభించినట్లు ప్రకటించారు. రాబోయే రెండు వారాల పాటు వేలాది మంది క్రీడాకారులు పతకాల కోసం పోటీ పడనున్నారు. ఈ చారిత్రాత్మక ఈవెంట్ సందర్భంగా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, దేశ క్రీడా బృందానికి తన శు భాకాంక్షలు తెలిపారు. "ఐచీ-నగోయాలో ఆసియా క్రీడలు ప్రారంభమవుతున్న వేళ, భారత బృందానికి నా శుభాకాంక్షలు. ప్రతి క్రీడాకారుడు అద్భుతమైన కృషి, అంకితభావం, దృఢ సంకల్పాన్ని ప్రదర్శించారు. వారిని చూసి భారతదేశం గర్విస్తోంది. వారు తమ అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాలి, బాగా ఆడాలి, ప్రకాశించాలి!" అని ప్రధాని 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు.ప్రారంభోత్సవ వేడుక భారత్‌కు ఎంతో ప్రత్యేకంగా నిలిచింది. ఒలింపిక్ పతక విజేత, షూటర్ మను భాకర్, కబడ్డీ స్టార్ పవన్ సెహ్రావత్ భారత బృందానికి పతాకధారులుగా ముందుండి నడిపించారు. త్రివర్ణ పతాకాన్ని చేతబూని స్టేడియంలోకి అడుగుపెట్టిన వీరిపై దేశం భారీ అంచనాలు పెట్టుకుంది. 2023లో హాంగ్‌జౌలో జరిగిన గత ఆసియా క్రీడల్లో 28 స్వర్ణాలతో సహా మొత్తం 107 పతకాలు సాధించి భారత్ రికార్డు సృష్టించిన విషయం తెలిసిందే. ఈసారి ఆ రికార్డును అధిగమించాలనే లక్ష్యంతో భారత బృందం బరిలోకి దిగుతోంది. ఆసియా క్రీడలకు జపాన్ ఆతిథ్యం ఇవ్వడం ఇది మూడోసారి. గతంలో 1958లో టోక్యోలో, 1994లో హిరోషిమాలో ఈ పోటీలు జరిగాయి. ఈసారి 45 దేశాలకు చెందిన క్రీడాకారులు 43 క్రీడాంశాల్లో తలపడనున్నారు.ఈ పోటీల్లో భారత్ పలు క్రీడల్లో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతోంది. పురుషుల, మహిళల క్రికెట్, కబడ్డీ జట్లతో పాటు, పురుషుల హాకీ జట్టు కూడా తమ టైటిళ్లను నిలబెట్టుకోవాలని చూస్తోంది. బ్యాడ్మింటన్‌లో పీవీ సింధు, వెయిట్‌లిఫ్టింగ్‌లో మీరాబాయి చాను భారత ప్రచారానికి నాయకత్వం వహించనున్నారు. షూటింగ్‌లో మను భాకర్, రెజ్లింగ్‌లో అమన్ సెహ్రావత్, బాక్సింగ్‌లో లవ్లీనా బోర్గోహెన్ వంటి ప్రముఖులు పతకాలపై కన్నేశారు. అథ్లెటిక్స్‌లో 75 మందికి పైగా భారత క్రీడాకారులు బరిలో ఉన్నారు. గుల్వీర్ సింగ్, తేజస్విన్ శంకర్, జ్యోతి యర్రాజీ, పారుల్ చౌదరి వంటి అథ్లెట్లు తమ సత్తా చాటడానికి సిద్ధమయ్యారు. షాట్‌పుట్‌లో తజిందర్‌పాల్ సింగ్ తూర్ వరుసగా రెండుసార్లు ఛాంపియన్‌గా నిలిచి, ఈసారి కూడా ఫేవరెట్‌గా పోటీ పడుతున్నాడు.

# పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించింది కేసీఆరే

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) దానం నాగేందర్‌పై అనర్హత పిటిషన్ కేసులో కోర్టు ఇచ్చిన తీర్పు బీఆర్ఎస్, కేసీఆర్‌కు చెంపపెట్టు లాంటిదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణలో పార్టీ ఫిరాయింపుల దుష్ట సంస్కృతిని ప్రవేశపెట్టిందే కేసీఆర్ అని తీవ్రంగా విమర్శించారు. కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని, ఎన్నిక జరిగితే ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం కాంగ్రెస్‌దేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. "గతంలో టీడీపీ టికెట్‌పై గెలిచిన తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను, కాంగ్రెస్ టికెట్‌పై గెలిచిన సబిత ఇంద్రారెడ్డిని బీఆర్ఎస్‌లో చేర్చుకుని మంత్రి పదవులు ఇచ్చింది కేసీఆర్ కాదా?" అని ప్రశ్నించారు. కేసీఆర్ చర్యల వల్లే రాష్ట్రంలో ఫిరాయింపుల సంస్కృతి పెరిగిపోయిందని ఆరోపించారు. అదే సమయంలో బీజేపీపైనా ఆయన విమర్శలు గుప్పించారు. ప్రభుత్వాలను కూల్చివేయడం, పార్టీలను చీల్చడం బీజేపీకి అలవాటని అన్నారు. దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్య వ్యవస్థను బీజేపీ నాశనం చేస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్, బీజేపీ ఇద్దరూ ఒకే తరహా రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు.

# దానంపై వేటు తీర్పుతో కలకలం

త్యజించినట్లే పరిగణిస్తారు. దానం నాగేందర్ స్వయంగా కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయడమే ఆయన ఫిరాయింపునకు తిరుగులేని ఆధారంగా మారింది. ఈ సాంకేతిక విషయాన్ని కోర్టు పరిగణనలోకి తీసుకుని అనర్హత విధించింది.

## మిగిలిన ఎమ్మెల్యేలపై ఆధారాల్లేవు!

కానీ, కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న మిగిలిన ఎమ్మెల్యేల వ్యవహారం దానం కేసు లాంటిది కాదు. వారెవరూ మరో పార్టీ బి-ఫామ్‌పై పోటీ చేయలేదు, అధికారికంగా ఎలాంటి నామినేషన్ దాఖలు చేయలేదు. కేవలం కాంగ్రెస్ నేతలను కలవడం, గులాబీ కండువాలు తీసి కాంగ్రెస్ కండువాలు కప్పుకోవడం లేదా ప్రభుత్వ వేదికలపై కనిపించడం వంటివి కోర్టుల్లో చట్టబద్ధమైన పార్టీ ఫిరాయింపు కిందకు రావని గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన పలు తీర్పులు తేల్చిచెప్పాయి. ఫోటోలు, పేపర్ క్లిప్పింగ్‌లు కోర్టుల్లో నిలబడే ఆధారాలు కావని, అసెంబ్లీ రికార్డుల ప్రకారం వారంతా ఇప్పటికీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలేననే సాంకేతిక వెసులుబాటు వారికి కొండంత అండగా ఉంది.

## ఇప్పటికే బీఆర్ఎస్ గూటికి చేరిన పటాన్ చెరు ఎమ్మెల్యే

ఇదిలా ఉంటే, కాంగ్రెస్‌లోకి వెళ్లిన ఆ 10 మంది ఎమ్మెల్యేలలో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఇప్పటికే మళ్లీ బీఆర్ఎస్ గూటికి చేరిపోయారు. అనర్హత వేటు ముప్పు, నియోజకవర్గంలో రాజకీయ ఒత్తిళ్లతో ఆయన తిరిగి సొంత పార్టీ ప్రచారాల్లో, బీఆర్ఎస్ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. మహిపాల్ రెడ్డి అధికారికంగా బీఆర్ఎస్ క్యాంప్‌లోకి వచ్చేయడంతో, ఆయనపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ నాయకత్వం ఇకపై పట్టుబట్టే అవకాశం ఉండదు. ఇక్కడే ఒక పెద్ద రాజకీయ చిక్కుముడి ఏర్పడుతోంది. మొత్తం 10 మంది ఎమ్మెల్యేలపై ఫిరాయింపు పిటిషన్లు వేసిన బీఆర్ఎస్, ఇప్పుడు పటాన్‌చెరు ఎమ్మెల్యేను మినహాయించి మిగిలిన 8 మందిపైనే చట్టపోరాటం కొనసాగించాల్సి ఉంటుంది. ఒకరిని వదిలేసి, తమకు నచ్చిన మిగిలిన వారిపై మాత్రమే అనర్హత వేటు వేయాలని పట్టుబడితే ఆ పోరాటంలో ఉన్న రాజకీయ సీరియస్‌నెస్ , నైతికత దెబ్బతింటుంది. అందరిపై ఒకే రకమైన ఆరోపణలు ఉన్నప్పుడు ఒకరిని ఎందుకు మినహాయించారు అనే సాంకేతిక ప్రశ్న ఎదురయ్యే ప్రమాదం ఉంది.

## స్పీకర్ అధికారాల్లో కోర్టులు జోక్యం చేసుకోవు!

అంతేకాకుండా, స్పీకర్ ట్రైబ్యునల్ పరిధిలోని అధికారాల్లో కోర్టులు నేరుగా జోక్యం చేసుకోవు. దానం నాగేందర్ కేసులో స్పష్టమైన బి-ఫామ్ ఆధారం ఉంది కాబట్టి తీర్పు వేగంగా వచ్చింది. కానీ మిగిలిన ఎమ్మెల్యేల విషయంలో అలాంటి అధికారిక దస్తావేజులు లేకపోవడంతో, స్పీకర్ ముందు విచారణ ప్రక్రియ సుదీర్ఘంగా సాగే అవకాశం ఉంది. ప్రతి కేసునూ వేర్వేరుగా విచారించి ఆధారాలు బేరీజు వేయాల్సి ఉండటం కాంగ్రెస్ ప్రభుత్వానికి, ఆ ఎమ్మెల్యేలకు కాలయాపన చేసే వీలును కల్పిస్తోంది. అందుకే బిఆర్ఎస్ నేతలు మీడియా వేదికగా ఎంత హడావుడి చేస్తున్నప్పటికీ, మిగిలిన ఎమ్మెల్యేలు , కాంగ్రెస్ నాయకత్వం ఈ పరిణామాలను పూర్తిగా లైట్ తీసుకుంటున్నాయి. చట్టంలోని లొసుగులు, కోర్టుల పరిమితులు తమకు అనుకూలంగా ఉన్నాయని భావిస్తుండటంతో దానం తీర్పు మిగిలిన 8 మంది ఎమ్మెల్యేల పదవులకు తక్షణమే ఎలాంటి ముప్పు తీసుకురాలేదని న్యాయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

# ఇక భారత్‌పై 100 శాతం టారిఫ్ మోత!

ఇకపై 100 శాతం టారిఫ్ విధించే అవకాశాలున్నాయి. ఈ రెండు ఆసియా దేశాలు రష్యా నుంచి భారీ స్థాయిలో చమురు, గ్యాస్‌ను దిగుమతి చేసుకుంటున్నాయి.

## ట్రంప్ కొత్త చట్టంలో ఏముంది

లిండ్సే ఓ. గ్రాహమ్ సాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ ఆఫ్ 2026 అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నకు రష్యా నుంచి భారీ స్థాయిలో చమురు, గ్యాస్ కొనుగోలు చేసే దేశాలపై 100% టారిఫ్ విధించే అధికారం లభిస్తుంది. ఈ కొత్త చట్టం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, రష్యా ప్రభుత్వంలోని సీనియర్ అధికారులు, కీలక ఆర్థిక సంస్థలు, ప్రస్తుత సముద్ర ఆంక్షలను తప్పించుకోవడంలో ఉపయోగించే ట్యాంకర్ల 'షాడో ఫ్లీట్'పై కూడా ఆంక్షలు విధిస్తుంది. ఉక్రెయిన్‌లో యుద్ధం తర్వాత రష్యాపై పాశ్చాత్య దేశాలు విధించిన ఆంక్షలను తప్పించుకునేందుకు రష్యా వందలాది చమురు ట్యాంకర్లతో ఒక సీక్రెట్ నేవీని సిద్ధం చేసింది. దీనిని షాడో ఫ్లీట్ అని అంటారు. ఈ కొత్త అమెరికా చట్టం ఈ అనుమానాస్పద ట్యాంకర్లను బ్లాక్‌లిస్ట్ చేస్తుంది, అలాగే ఈ నౌకలు అంతర్జాతీయ పోర్టుల్లో నిలవకుండా, ఇన్సూరెన్స్ సైతం పొందకుండా, సముద్ర మార్గాలను ఉపయోగించకుండా అడ్డుకోవడానికి అమెరికా నేవీ, ఇంటెలిజెన్స్‌కు ప్రత్యేక అధికారాలు కూడా ఇస్తుంది.

## రష్యా ఆర్థిక వ్యవస్థకు ఎదురుదెబ్బ

రష్యాపై ఆంక్షలు విధించే బిల్లు లక్ష్యం రష్యా ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీయడం, తద్వారా ఉక్రెయిన్‌తో యుద్ధం చేయడానికి వారికి లభించే నిధుల కొరత ఏర్పడేలా చేయడం. ఈ చట్టంలోని నిబంధనల ప్రకారం, అమల్లోకి వచ్చిన తర్వాత గత 12 నెలల్లో రష్యా నుంచి అత్యధిక మొత్తంలో ముడి చమురు లేదా సహజ వాయువు కొనుగోలు చేసి, భవిష్యత్తులో కొనుగోళ్లు కొనసాగించే 5 దేశాలకు ఇది షాకివ్వనుంది. భారత్, చైనా దేశాలు రష్యా నుంచి ముడి చమురు, గ్యాస్ లకు అతిపెద్ద కొనుగోలుదారులుగా ఉన్నాయి.

## భారత్ వైఖరి ఏమిటి.?

దేశంలోని 140 కోట్ల ప్రజల ఇంధన భద్రతను నిర్ధారించడానికి పూర్తిగా కట్టుబడి ఉందని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఇప్పటికే స్పష్టం చేసింది. భారత్ తమ దేశానికి అందుబాటు ధరల్లో, విశ్వసనీయ వనరులు అవసరమని పేర్కొంది. ట్రంప్ కొత్త చట్టం తర్వాత కూడా భారత్ రష్యా నుంచి చమురు, గ్యాస్ దిగుమతులు కొనసాగిస్తే, భారత్- అమెరికా మధ్య ఉన్న ద్వైపాక్షిక, వాణిజ్య సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇటీవల ఢిల్లీ వేదికగా జరిగిన బ్రిక్స్ సదస్సులో భారత్ పరోక్షంగా అమెరికా టారిఫ్ విధానాలను వ్యతిరేకించింది. ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగితేనే మనకు ప్రయోజనం ఉంటుందని, ఏకఛత్రాధిపత్యాన్ని ఎవరూ ప్రోత్సహించకూడదని సూచించింది.

# సుప్రీంకోర్టుకెక్కిన దానం నాగేందర్

నాగేందర్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరిస్తుందా లేదా ఒకవేళ స్వీకరిస్తే తదుపరి న్యాయ ప్రక్రియ ఎలా సాగుతుంది అనే అంశాలపై ఆసక్తి నెలకొంది.దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేస్తూ తెలంగాణ హైకోర్టు శుక్రవారం సంచలన తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. బీఆర్ఎస్ తరఫున 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నుంచి గెలిచిన దానం నాగేందర్ అనంతరం కాంగ్రెస్‌లో చేరారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. అప్పటికి ఆయన ఎమ్మెల్యేగా కొనసాగుతుండటాన్ని ప్రస్తావిస్తూ బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అనర్హత పిటిషన్లు దాఖలు చేశారు.ఈ పిటిషన్లపై విచారణ జరిపిన హైకోర్టు స్పీకర్ గడ్డం ప్రసాద్ గతంలో ఇచ్చిన నిర్ణయాన్ని పక్కనపెట్టి దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటించింది. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ నిబంధనల ప్రకారం ఈ అనర్హత వర్తిస్తుందని పేర్కొంది. హైకోర్టు తీర్పు ప్రకారం అనర్హత 2024 ఏప్రిల్ 23వ తేదీ నుంచి అమల్లోకి వస్తుందని పేర్కొంది. అలాగే ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీగా ఉన్నట్లు పరిగణనలోకి తీసుకోవాలని తీర్పు ప్రతులను అసెంబ్లీ స్పీకర్ కార్యాలయంతో పాటు ఎన్నికల సంఘానికి పంపాలని రిజిస్ట్రీని ఆదేశించింది. హైకోర్టు తీర్పుపై తదుపరి న్యాయపోరాటంలో భాగంగానే దానం నాగేందర్ ఎస్ఎల్‌పీ దాఖలు చేశారు. అయితే కేవలం ఎస్ఎల్‌పీ దాఖలు చేయడంతో హైకోర్టు తీర్పుపై ఆటోమేటిక్‌గా స్టే వచ్చినట్లు కాదని న్యాయ నిపుణులు చెబుతున్నారు. ముందుగా సుప్రీంకోర్టు పిటిషన్‌ను పరిశీలించి దానిని విచారణకు స్వీకరించాలా లేదా అనే అంశంపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఎస్ఎల్‌పీని విచారణకు స్వీకరించి అప్పీల్‌కు అనుమతిస్తే హైకోర్టు తీర్పులోని న్యాయపరమైన అంశాలను సుప్రీంకోర్టు పరిశీలించే అవకాశం ఉంటుంది. అదే సమయంలో హైకోర్టు తీర్పు అమలుపై మధ్యంతర ఉపశమనం కోరితే దానిపై కూడా సుప్రీంకోర్టు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. అందువల్ల దానం నాగేందర్ పిటిషన్ దాఖలు చేయడం ఒక దశ కాగా దానిని సుప్రీంకోర్టు ఎలా స్వీకరిస్తుంది, తదుపరి ఎలాంటి ఆదేశాలు ఇస్తుంది అనేది కీలకంగా మారింది.ఇదే కేసులో పిటిషనర్లు అయిన బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సుప్రీంకోర్టులో కేవియట్లు దాఖలు చేశారు. దానం నాగేందర్ హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయిస్తే తమ వాదనలు కూడా వినాలని వారు కేవియట్ ద్వారా కోరారు. కేవియట్ ఉండటం వల్ల పిటిషన్‌పై ఏకపక్షంగా ఆదేశాలు జారీ చేయకుండా సంబంధిత పక్షానికి నోటీసు లేదా వాదనలు వినే అవకాశం ఉంటుంది. దీంతో దానం నాగేందర్ ఎస్ఎల్‌పీపై జరిగే తదుపరి విచారణలో ఈ ఇద్దరు నేతల తరఫున న్యాయవాదుల వాదనలు కూడా ప్రాధాన్యం సంతరించుకునే అవకాశం ఉంది. హైకోర్టు తీర్పుతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీగా పరిగణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే దానం నాగేందర్ సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో ఇప్పుడు తదుపరి న్యాయపరిణామాలపై ఉత్కంఠ నెలకొంది. సుప్రీంకోర్టు ఎస్ఎల్‌పీని స్వీకరిస్తుందా మధ్యంతర ఉపశమనం ఇస్తుందా హైకోర్టు తీర్పుపై తదుపరి విచారణకు మార్గం సుగమం చేస్తుందా అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. మరోవైపు దానం నాగేందర్ మాత్రం ప్రజాక్షేత్రంలో పోరాడతానని అవసరమైతే ఉప ఎన్నికకు సిద్ధంగా ఉన్నానని ఇప్పటికే కీలక వ్యాఖ్యలు చేశారు

## అక్టోబర్ 1న కరవు మండలాలను ప్రకటించండి

సీఎం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. కరువు మండలాల గుర్తింపు ప్రక్రియ పూర్తి పారదర్శకంగా, శాస్త్రీయంగా ఉండాలని సీఎం స్పష్టం చేశారు. వర్షపాతం, పంటల సాగు, భూగర్భ జలాలు, నేలలో తేమ శాతం, ఉపగ్రహ చిత్రాలు, జలాశయాల్లో నీటి నిల్వలు వంటి ఆరు కీలక అంశాలను సమగ్రంగా విశ్లేషించి తుది నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

### 513 మండలాల్లో కరవు ఛాయలు

2026 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రాష్ట్రంలోని 28 జిల్లాల్లో ప్రాథమిక అంచనాల ప్రకారం మొత్తం 513 మండలాల్లో కరవు ఛాయలు అలుముకున్నాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వీటిలో 268 మండలాల్లో తీవ్రమైన వర్షాభావం, 245 మండలాల్లో మోస్తరు వర్షాభావం నెలకొందని తెలిపారు. క్షేత్రస్థాయి పరిశీలనను వ్యవసాయ శాఖ చేపడుతుందని, జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు పంట, దిగుబడి నష్టాన్ని అంచనా వేస్తాయని చెప్పారు. ఈ నివేదికలను కలెక్టర్లు సెప్టెంబర్ 24లోగా రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖకు సమర్పించాల్సి ఉంటుందన్నారు. సెప్టెంబర్ 29న జరిగే రాష్ట్ర స్థాయి కమిటీ సమావేశంలో ఈ ప్రతిపాదనలను పరిశీలించి, తుది జాబితాను సిద్ధం చేస్తామని అధికారులు వెల్లడించారు.

### ఉద్యాన పంటల రక్షణ, సూక్ష్మ సేద్యానికి ప్రాధాన్యత

వర్షాభావ పరిస్థితులతో పాటు ఎల్‌నినో ప్రభావం వల్ల ఉద్యాన పంటలు ప్రమాదంలో ఉన్నాయని అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. రాష్ట్రంలోని 21 జిల్లాల్లో 1,357 రైతు భరోసా కేంద్రాల పరిధిలోని పంటలు 'హై రిస్క్' కేటగిరీలో ఉన్నాయని, సుమారు 17,916 హెక్టార్లలో నారింజ, బత్తాయి, మామిడి, మిరప, ఉల్లి వంటి పంటలు ప్రభావితం కానున్నాయని తెలిపారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి, ఉద్యాన పంటలను కాపాడేందుకు ఇప్పటికే రూ.190 కోట్లు కేటాయించామని, వాటికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. నీటి లభ్యత తగ్గుతున్న నేపథ్యంలో తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణాన్ని కాపాడేందుకు సూక్ష్మ సేద్యం (మైక్రో ఇరిగేషన్) వైపు రైతులను ప్రోత్సహించాలని నిర్దేశించారు. ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ సేవలను 'మన మిత్ర' వాట్సప్ గవర్నెన్స్ ద్వారా రైతులకు అందుబాటులోకి తేవడాన్ని ప్రశంసించారు. సూక్ష్మ సేద్యంతో పాటు ప్రకృతి సేద్యం వైపు రైతులను మళ్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

### తాగునీటి ఎద్దడిపై ప్రత్యేక దృష్టి.. విశాఖకు కార్యాచరణ

రాష్ట్రంలో ఏ ఒక్క ప్రాంతంలోనూ ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. బోర్లపై ఆధారపడిన ప్రాంతాల్లో అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ముఖ్యంగా విశాఖపట్నం నగరంలో భవిష్యత్తులో తాగునీటి సమస్య తలెత్తకుండా ఇప్పటి నుంచే పక్కా కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. ఇంజినీర్లు, కాంట్రాక్టర్లతో తక్షణమే అత్యవసర సమావేశం నిర్వహించి తాగునీటి సరఫరా పనులను వేగవంతం చేయాలన్నారు. విశాఖ సమీపంలోని రిజర్వాయర్లను యుద్ధప్రాతిపదికన నింపేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని, మేఘాద్రిగడ్డకు పోలవరం ఎల్‌ఎంసీ ప్యాకేజీ-8 కింద పైపులైన్ ద్వారా నీటిని తరలించే పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. ప్రస్తుతం విశాఖ నగరానికి మరో రెండు నెలలకు సరిపడా నీటి నిల్వలు ఉన్నాయని ఈ సందర్భంగా అధికారులు సీఎంకు వివరించారు.

## సర్కార్ బడి పిల్లలకు 'కొత్త లుక్'

ప్రభుత్వ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లోని విద్యార్థులకు ఒక జత యూనిఫాం పంపిణీ పూర్తయిందని అధికారులు సీఎంకు వివరించారు. రెండో జత యూనిఫాంను ఈ నెలాఖరులోగా అందజేస్తామని తెలిపారు. కేజీబీవీలు, మోడల్ స్కూళ్ల విద్యార్థులకు ఇప్పటికే రెండు జతల యూనిఫాంలు అందించినట్లు వెల్లడించారు.

### నోటు పుస్తకాల పంపిణీ పూర్తి

రాష్ట్రంలోని విద్యార్థులందరికీ నోటు పుస్తకాల పంపిణీ పూర్తయిందని అధికారులు తెలిపారు. ప్రభుత్వ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్ల విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు, కటోరాలు, స్పూన్లు, కప్పులు, కార్పెట్లు, బెడ్‌షీట్లు, టవళ్లు తదితర సామగ్రి పంపిణీ కూడా పూర్తయిందని వివరించారు.

### తొలిరోజే అన్ని సౌకర్యాలు

వచ్చే విద్యా సంవత్సరం పాఠశాలలు ప్రారంభమైన రోజే విద్యార్థులకు యూనిఫాం, ఇతర సామగ్రి అందేలా ఇప్పటి నుంచే కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న విద్యార్థుల సంఖ్యకు అదనంగా 10 శాతం మంది విద్యార్థులు పాఠశాలల్లో చేరే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు.

### నాణ్యతపై తల్లిదండ్రుల సంతృప్తి

ఈ ఏడాది విద్యార్థులకు అందించిన యూనిఫాంలు, ఇతర సామగ్రి నాణ్యతపై తల్లిదండ్రులు సంతృప్తి వ్యక్తం చేసినట్లు అధికారులు తెలిపారు. సమీక్ష సమావేశంలో ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్‌రెడ్డి, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఎర్రవల్లి భూముల సర్వేలో మరో ట్విస్ట్

ఈ భూములు ఎర్రవల్లి, శివారు వెంకటాపూర్, వరదరాజుపూర్ ప్రాంతాలకు విస్తరించి ఉన్నట్లు అధికారులు గుర్తిస్తున్నారు. శుక్రవారం నాటికి 388 ఎకరాల భూముల బౌండరీని శాటిలైట్ సాయంతో నిర్ధారించినట్లు సమాచారం. శనివారం కూడా ప్రత్యేక బృందాలతో సర్వే కొనసాగింది. సర్వే నంబర్ 325లోని 388 ఎకరాల్లో ఎర్రవల్లి గ్రామానికి 250 ఎకరాలు మాత్రమే ఉన్నాయని వెంకటాపూర్ గ్రామస్థులు చెబుతున్నారు. మిగిలిన భూమిలో సుమారు 180 ఎకరాలు తమ గ్రామ పరిధికి చెందినవేనని వారు పేర్కొంటున్నారు. గతంలో అధికారుల రికార్డుల నిర్వహణలో జరిగిన తప్పిదాల కారణంగా తమ భూములు ఎర్రవల్లి సర్వే నంబర్‌లోకి వెళ్లాయని వారు ఆరోపిస్తున్నారు.పాత ఖాస్రా, సేత్వార్ రికార్డులను ఆధారంగా తీసుకుని భూముల హద్దులను నిర్ణయించాలని వెంకటాపూర్ వాసులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న సర్వేలో తమ గ్రామానికి చెందిన భూములకు అన్యాయం జరగకుండా చూడాలని అధికారులను కోరుతున్నారు. అయితే ఈ హక్కు వాదనపై తుది నిర్ణయం అధికారిక రికార్డులు, క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం వెలువడాల్సి ఉంది. ఇదిలా ఉంటే సర్వే నంబర్ 325లో వ్యవసాయం చేస్తున్న రైతులకు రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. మొత్తం 215 మంది రైతులకు నోటీసులు ఇవ్వాలని అధికారులు నిర్ణయించగా తొలివిడతలో 50 మందికి నోటీసులు ఇచ్చినట్లు సమాచారం. ఈ నెల 21వ తేదీ నుంచి నాలుగు విడతల్లో రైతుల సమక్షంలో తదుపరి ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలుస్తోంది.నోటీసుల్లో పేర్కొన్న తేదీన రైతులు తమ భూముల వద్దకు హాజరై సంబంధిత వివరాలను అధికారులకు తెలియజేయాల్సి ఉంటుంది.

క్షేత్రస్థాయిలో ప్రస్తుతం ఎవరు భూమిని సాగు చేస్తున్నారు, ఎవరి ఆధీనంలో ఉంది అనే వివరాలను కూడా అధికారులు నమోదు చేయనున్నారు. దీనిని ఎంజాయ్‌మెంట్ సర్వేగా నిర్వహించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఎర్రవల్లి భూముల వ్యవహారంలో కేవలం భూముల కొలతలకే పరిమితం కాకుండా పాత రెవెన్యూ రికార్డులను కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. క్షేత్రస్థాయిలో గుర్తించిన హద్దులను పాత రికార్డులతో సరిపోల్చి భూముల స్వభావం, హక్కులు, సాగు వివరాలను నిర్ధారించే ప్రక్రియ కొనసాగుతోంది.శనివారం 5 ప్రత్యేక బృందాలు వివిధ ప్రాంతాల్లో డిజిటల్ సర్వే చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. మరో బృందం తహసీల్దార్ కార్యాలయంలో పాత రికార్డులు, ఫైళ్లను పరిశీలించింది. ఈ భూముల వ్యవహారంపై ఇప్పటికే రాజకీయంగా తీవ్ర చర్చ జరుగుతోంది. ఎర్రవల్లిలోని సర్వే నంబర్ 325లోని భూములపై ప్రభుత్వం విచారణ చేపట్టిన నేపథ్యంలో అధికారుల సర్వేకు కొందరు రైతుల నుంచి అభ్యంతరాలు కూడా వ్యక్తమయ్యాయి. పోలీసు బందోబస్తు మధ్య అధికారులు సర్వేను కొనసాగించారు.ఇప్పుడు వెంకటాపూర్ గ్రామస్థులు కూడా 180 ఎకరాలపై తమ హక్కులను పరిశీలించాలని కోరడంతో వ్యవహారం మరింత ఆసక్తికరంగా మారింది. పాత రికార్డులు, ప్రస్తుత భూమి హద్దులు, సాగు వివరాలు, అధికారిక రెవెన్యూ రికార్డులను అధికారులు ఎలా సరిపోల్చుతారన్నది కీలకంగా మారింది. సర్వే, నోటీసులు, ఎంజాయ్‌మెంట్ సర్వే పూర్తయిన తర్వాతే ఈ భూములకు సంబంధించిన వాస్తవ పరిస్థితిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## వైన్ షాపులో అగ్ని ప్రమాదం

**రంగారెడ్డి** రంగారెడ్డి జిల్లా కందుకూరు మండల కేంద్రంలోని జై భవాని వైన్స్ లో అగ్ని ప్రమాదం ఉదయం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగిందని అనుమానిస్తున్నారు. సమాచారం అందుకున్న కందుకూరు పోలీసులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు.

ఫైర్ సిబ్బంది చేరుకొని శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే మంటలు దాటికి వైన్ షాప్ లో మద్యం ఇతర సామాగ్రి భారీగా దద్దమయిద్ధి తెలుస్తుంది జరిగిన ఆస్తి నష్టం ఎంత అన్నది అధికారులు పరిశీలన అనంతరం తెలుస్తుంది. అగ్ని ప్రమాదం అసలు కారణమేంటి షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగిందా వైన్స్ లో ఎంత మేరా నష్టం వాటిల్లింది అనే అంశాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు...

## అక్రమ భూములు నిర్వాసితులకే కేటాయించాలి

### భూమికి భూమి పరిహారం అందించాలని జిల్లా కలెక్టర్‌కు వినతి



గజ్వేల్ (ప్రశ్న న్యూస్ ) కొండపోచమ్మ సాగర్, మల్లన్న సాగర్, రంగనాయక సాగర్, గౌరవెల్లి రిజర్వాయర్ల నిర్మాణం, విస్తరణల కారణంగా భూములు కోల్పోయి నిర్వాసితులైన తమకు నగదు పరిహారానికి బదులుగా భూమికి భూమి పరిహారం అందించాలని నిర్వాసితులు కోరారు. ఈ మేరకు సిద్దిపేట జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.రిజర్వాయర్ల నిర్మాణం కోసం భూములు కోల్పోయినప్పటి నుంచి భూమికి భూమి పరిహారం ఇవ్వాలని కోరుతున్నప్పటికీ, తమకు కేటాయించేందుకు ప్రభుత్వ భూములు లేవని అధికారులు చెబుతున్నారని నిర్వాసితులు తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ప్రభుత్వం చేపడుతున్న సర్వేలు, విచారణల నేపథ్యంలో చట్టపరంగా ఆక్రమణలు నిర్ధారణ అయితే ఆయా భూములను స్వాధీనం చేసుకుని ముందుగా భూములు కోల్పోయిన నిర్వాసితులకు కేటాయించాలని కోరారు.

నిర్వాసితుల వివరాల ప్రకారం కొండపోచమ్మ సాగర్ నిర్వాసితులకు సుమారు 171 ఎకరాలు, మల్లన్న సాగర్ నిర్వాసితులకు 80 ఎకరాలు, రంగనాయక సాగర్ నిర్వాసితులకు 9 ఎకరాలు, గౌరవెల్లి నిర్వాసితులకు 15 ఎకరాలు అవసరమవుతున్నాయని తెలిపారు. మొత్తంగా సుమారు 275 ఎకరాల భూమి అవసరమవుతున్నట్లు పేర్కొన్నారు.మర్కుక్ మండలం, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ పరిసర ప్రాంతాల్లో మాజీ ప్రజాప్రతినిధులు, మాజీ అధికారులు, కాంట్రాక్టర్లు తదితరులకు భూములు ఉన్నాయంటూ తమకు కొన్ని వార్తలు, ఆరోపణలు అందాయని నిర్వాసితులు తెలిపారు. ఆయా భూములు చట్టబద్ధంగా పొందినవా, ప్రభుత్వ భూములా, లేక అక్రమ ఆక్రమణలకు సంబంధించినవా అనే అంశాన్ని రెవెన్యూ, రిజిస్ట్రేషన్ రికార్డుల ఆధారంగా సమగ్రంగా విచారణ చేసి వాస్తవాలను వెలికితీయాలని కోరారు. భూమికి భూమి పరిహారం అందించడం ద్వారా తమ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు ప్రభుత్వంపై పరిహారం భారం కూడా తగ్గుతుందని పేర్కొన్నారు.ఇప్పటికే 28-05-2020న సంబంధిత ప్రజాప్రతినిధులు, పెద్దలకు భూమికి భూమి పరిహారం కోరుతూ వినతులు సమర్పించినట్లు తెలిపారు. తాజాగా ప్రభుత్వ భూములపై జరుగుతున్న సర్వేలు, విచారణల నేపథ్యంలో తమ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని, అర్హత ఉన్న నిర్వాసితులకు భూమికి భూమి పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు.

# వెలుగుల తిరుమల..
# వైకుంఠాన్ని తలపించే విద్యుత్


- సాలకట్ల బ్రహ్మోత్సవాలకు విద్యుత్ కాంతులతో సరికొత్త శోభ
- తిరుమల నుంచి తిరుపతి వరకు కనువిందు చేస్తున్న అలంకరణలు..
- రాత్రివేళల్లో భక్తులకు కనువిందు
  నెలల తరబడి శ్రమించిన సిబ్బంది..
- సంప్రదాయం, సాంకేతికతల మేళవింపుతో అద్భుత దృశ్యాలు

**(తిరుమల ప్రశ్న న్యూస్ ప్రత్యేక కథనం తోట వెంకట్ బ్యూరో ఆంధ్ర ప్రదేశ్)**











ఏడు కొండలు.. ఆ కొండలపై కొలువైన కలియుగ ప్రత్యక్ష దైవం.. స్వామివారి బ్రహ్మోత్సవ వైభవాన్ని చూసేందుకు దేశం నలుమూలల నుంచి తరలివచ్చే భక్తజనం.. పగటివేళల్లో వాహన సేవలతో ఆధ్యాత్మిక సందడి.. రాత్రివేళల్లో వేలాది విద్యుత్ దీపాలతో మెరిసే తిరుమల. సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమల, తిరుపతిలో చేపట్టిన విద్యుత్ అలంకరణలు ఉత్సవ శోభను మరింత ఇనుమడింపజేస్తున్నాయి.స్వామివారి వాహన సేవల వైభవం ఒకవైపు భక్తులను ఆధ్యాత్మిక పరవశంలో ముంచెత్తుతుంటే.. రాత్రి వేళల్లో విద్యుత్ కాంతులతో మెరిసే ఆలయ పరిసరాలు, ఘాట్ రహదారులు, ప్రధాన కూడళ్లు, భక్తుల రాకపోకలు సాగించే ప్రాంతాలు మరోవైపు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. చీకటి కొండపై వెలుగుల హారం కట్టినట్లుగా.. తిరుమల కొండలు కాంతులీనుతున్న దృశ్యం భక్తులను మంత్రముగ్ధులను చేస్తోంది.

### వెలుగులతో స్వాగతం.. అడుగడుగునా వైభవం

సాధారణ రోజుల్లోనే తిరుమలలో ఆధ్యాత్మిక వాతావరణం ప్రత్యేకంగా ఉంటుంది. బ్రహ్మోత్సవాల సమయంలో ఆ వాతావరణం మరింత ఉత్సవ శోభను సంతరించుకుంటుంది. భక్తులు తిరుమల కొండపైకి చేరుకున్న వెంటనే వారికి కనిపించే అలంకరణలు ఉత్సవాల వైభవాన్ని తెలియజేస్తున్నాయి.ప్రధాన మార్గాలు, కూడళ్లు, ఆలయ పరిసరాలు, భక్తుల సంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణలు రాత్రి వేళల్లో ప్రత్యేక ఆకర్షణగా మారాయి. వివిధ ఆకృతులు, రంగురంగుల కాంతులు, సంప్రదాయ చిహ్నాలను ప్రతిబింబించే అలంకరణలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి.ఒకవైపు కొండల నడుమ సహజ సౌందర్యం.. మరోవైపు విద్యుత్ దీపాల వెలుగులు.. మధ్యలో గోవింద నామస్మరణ. ఈ మూడు కలిసిన దృశ్యం తిరుమలను మరో ప్రపంచంలా చూపిస్తోంది.

### బ్రహ్మోత్సవాలకే ప్రత్యేక శోభ



శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు అంటే కేవలం వాహన సేవలు మాత్రమే కాదు. ఆలయ అలంకరణలు, పుష్పాలంకరణలు, విద్యుత్ దీపాలంకరణలు, భక్తుల సౌకర్యాల కోసం ఏర్పాటు చేసే ప్రత్యేక వసతులు.. ఇవన్నీ కలసి బ్రహ్మోత్సవాల సమగ్ర వైభవాన్ని ఆవిష్కరిస్తాయి.ఉదయం నుంచి రాత్రి వరకు తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతున్న సమయంలో.. రాత్రివేళల్లో వెలుగులతో మెరిసే ప్రాంతాలు భక్తులకు మరో అనుభూతిని అందిస్తున్నాయి. వాహన సేవ ముగిసిన తర్వాత కూడా భక్తులు కొండపై కనిపించే విద్యుత్ అలంకరణలను ఆసక్తిగా తిలకిస్తున్నారు.ఏడు కొండలు.. శ్రీవారి ఆలయం.. గోవింద నామస్మరణ.. వేలాది భక్తులు.. రాత్రి ఆకాశాన్ని తలపించే విద్యుత్ వెలుగులు..ఇవన్నీ కలిసినప్పుడు తిరుమలలో ఆవిష్కృతమయ్యేది ఒక అపూర్వమైన ఆధ్యాత్మిక దృశ్యకావ్యం. వెలుగుల్లో తిరుమల..భక్తిలో గోవిందుడు..వైభవంలో బ్రహ్మోత్సవాలు..తరతరాలకు మిగిలే జ్ఞాపకంగా విద్యుత్ కాంతుల తిరుమల

## ఐసిడిఎస్ ఆధ్వర్యంలో రెడ్డిపల్లి జెడ్ పి హెచ్ ఎస్ లో పోషణ మేళా నిర్వహణ

### గ్రామ సర్పంచ్ పద్మావతి అశోక్



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) నర్సాపూర్ మండలంలోని జడ్పిహెచ్ఎస్ రెడ్డిపల్లి లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసం సందర్భంగా ఈరోజు విద్యార్థులకు పోషణ మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పద్మ అశోక్ హాజరయ్యారు. విద్యార్థులు తయారు చేసిన వివిధ పోషకాహార వంటకాలతో ఏర్పాటు చేసిన పోషణ స్టాల్‌ను పరిశీలించి, వాటి తయారీ మరియు పోషక విలువల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ మరియు ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ మరియు సైన్స్ టీచర్ రాధిక మాట్లాడుతూ , మన చుట్టుపక్కల, ఇంటి పరిసరాల్లో సులభంగా లభించే వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలను ఆహారంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు లభించే ఆహార పదార్థాలను నిత్యజీవితంలో తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. ఆరోగ్యంగా ఉంటేనే విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగగలరని సూచించారు.ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరళ కుమారి మాట్లాడుతూ, పిల్లలు చిన్న వయస్సు నుంచే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలని తెలిపారు. బయట లభించే జంక్‌ఫుడ్‌కు అలవాటు పడకుండా, ఇంట్లో తాజాగా వండిన పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు. చిన్న వయస్సు నుంచే సరైన ఎదుగుదల మరియు ఆరోగ్యానికి సమతుల్య పోషకాహారం ఎంతో అవసరమని తెలిపారు.మండలంలోని వివిధ గ్రామాల్లో స్థానిక ప్రైమరీ మరియు జడ్పిహెచ్ఎస్ స్కూల్ లలో కూడా ఈ కార్యక్రమాన్ని చేయడం జరిగినది ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం అందరితో పోషణ ప్రతిజ్ఞ చేయించడం జరిగినది

## మీ పిల్లలకు ఆధార్ నమోదు పూర్తి చేశారా

### మా పిల్లలకు ఆధార్ నమోదు చేసుకున్నాను

### ఏకాంషి , అద్విత, తమ పిల్లల ఆధార్ నమోదుకు ఆధార్ సెంటర్ కు

### కలెక్టర్ ప్రతిమా సింగ్, శుభం సింగ్ దంపతులు



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) 0 నుండి 05 సంవత్సరాల లోపు పిల్లలకు బాల ఆధార్ తప్పనిసరి అని కలెక్టర్ ప్రతిమసింగ్ తెలిపారుమెదక్ పట్టణంలో రిజిస్ట్రేషన్ ఆఫీస్ వద్ద సామాన్యురాలుగా కుటుంబ సభ్యులతో కలిసి తన పిల్లల ఏకాంషి , అద్విత, ఆధార్ నమోదు చేసుకుని ఆదర్శంగా నిలిచిన కలెక్టర్ ప్రతిమాసింగ్ దంపతులుశనివారం జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ దంపతులు మెదక్ పట్టణంలో సబ్ రిజిస్టర్ ఆఫీస్ కార్యాలయం వద్ద ఆధార్ నమోదు సెంటర్లో వారి ఇద్దరి పిల్లల ఆధార్ నమోదును పూర్తి చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ0 నుండి ఐదు సంవత్సరాల పిల్లల ఆధార నమోదులో ఉండాలన్నారు పిల్లల కోసం బాల ఆధార్‌ను యూఐడీఏఐ తీసుకొచ్చింది అని అన్నారు..0 నుండి కేవలం 5 సంవత్సరాల్లోపు పిల్లలకు దీనిని జారీ చేస్తారు. అని వివరించారు.బాల ఆధార్ అనేది నీలి రంగులో ఉంటుందన్నారు. పిల్లలకు ప్రత్యేకంగా జారీ చేసే ఆధార్ కార్డు ఇది. పిల్లలను గుర్తించడంలో ఉపయోగపడుతుందని స్కూల్స్, పాస్ పోర్ట్ దరఖాస్తులు, ప్రభుత్వ స్కీమ్స్, ఇతర సేవలను పొందటంలో సహాయపడుతుంది. అని తల్లిదండ్రులు తమ పిల్లలకు ఈ కార్డును తీసుకోవడం వల్ల వారికి ప్రత్యేక గుర్తింపును అందిస్తుంది. పిల్లలు పుట్టగానే దీని కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు.ఐదేళ్ల తర్వాత ఆధార్ అప్‌డేషన్ చేసుకోవాలని, 15 నుంచి 17 సంవత్సరాల మధ్య కూడా మరొకసారి కూడా అప్‌డేషన్ చేసుకో వాలని సూచించారు.అప్పుడే పుట్టిన పిల్లల దగ్గర నుంచి పెద్దవారి వరకు దేశంలో నివసించే ప్రతీఒక్కరికీ ఆధార్ అనేది తప్పనిసరి అని అన్నారు .

## కాసా గ్రాండ్ డెవలపర్స్‌పై ఏజీ కాలనీ వాసుల ఆరోపణలు

### రోడ్లు, డ్రైనేజీ ధ్వంసం చేశారని ఆవేదన..

### 11 కేవీ లైన్‌తో ప్రమాదం పొంచి ఉందని వెల్లడి



మేడ్చల్( ప్రశ్న న్యూస్) గుండ్లపోచంపల్లి డివిజన్ పరిధిలోని ఏజీ కాలనీ వాసులు కాసా గ్రాండ్ డెవలపర్స్ తీరుపై ఆందోళన వ్యక్తం చేశారు. డెవలపర్స్ చేపడుతున్న పనుల కారణంగా కాలనీలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మీడియాకు తెలిపారు. కాసా గ్రాండ్ డెవలపర్స్ కాలనీలోని రోడ్లు, డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌ను ధ్వంసం చేశారని, ప్లాట్ల హద్దులను సూచించే హద్దురాళ్లను తొలగించారని కాలనీ వాసులు ఆరోపించారు. అంతేకాకుండా నిత్యం టిప్పర్ లారీల ద్వారా మట్టిని తరలిస్తుండటంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. కాలనీ పరిధిలో సరైన విద్యుత్ అనుమతులు లేకుండానే 11 కేవీ విద్యుత్ లైన్‌ను ప్రమాదకరంగా ఏర్పాటు చేశారని వారు ఆరోపించారు. కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులు చేపడుతున్న సమయంలో విద్యుత్ లైన్ వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, నిబంధనలకు విరుద్ధంగా పనులు జరిగితే చర్యలు తీసుకోవాలని ఏజీ కాలనీ వాసులు కోరారు. కాలనీ ప్రజల భద్రతకు, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏజీ కాలనీ అధ్యక్షులు నాగేశ్వరరావు, సెక్రెటరీ ఏపీ రావు, వైస్ ప్రెసిడెంట్ పద్మా రెడ్డి, జాయింట్ సెక్రెటరీ సుభాష్ రెడ్డి, ట్రెజరర్ జయసినారెడ్డి కమిటీ మెంబర్స్ ప్రతీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కర్నూలు మేయర్ రేసులో మాస్ లీడర్

# ఉదయ్ కుమార్ బెస్త ముందంజ

**నగర రాజకీయాల్లో సరికొత్త టర్నింగ్ పాయింట్**

**యువత గుండెల్లో తిరుగులేని ఫాలోయింగ్**

**రిజర్వేషన్ ఏదైనా పొలిటికల్ హాట్ టాపిక్‌గా ఉదయ్**

**ఓటు బ్యాంకు రాజకీయాలకు బెస్తల చెక్**

**విద్యార్థి పోరాటాల నుంచి ప్రజా సేవ వరకు.. ఉదయ్ ప్రస్థానం !**



కర్నూలు ( ప్రశ్న న్యూస్) ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రాజకీయాల్లో రాజకీయ చైతన్యానికి మారుపేరైన కర్నూలు నగర పీఠాన్ని దక్కించుకునేందుకు యువ కెరటం ఉరకలేస్తోంది. విద్యావంతుడు, సామాజిక ఉద్యమ నేత ఉదయ్ కుమార్ బెస్త, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో మేయర్ రేసులో హాట్ టాపిక్‌గా మారారు. రిజర్వేషన్ ఏదైనా (ఓసి జనరల్/బిసి) సరే.. పోటీకి తాను సై అంటున్న ఈ యువనేత రాకతో కర్నూలు నగర రాజకీయాల్లో సరికొత్త సమీకరణాలు మొదలయ్యాయి.

### - గెలుపోటములను శాసించే శక్తిగా 40 వేల బెస్త ఓటు బ్యాంక్ :

కర్నూలు కార్పొరేషన్ పరిధిలో బెస్త సామాజికవర్గం ఓట్లు అత్యంత కీలకం కానున్నాయి. కోడుమూరు, పాణ్యం, కర్నూలు అర్బన్ నియోజకవర్గాల పరిధిలోని నగర వార్డుల్లో దాదాపు 35,000 నుండి 40,000 వరకు బెస్తల ఓటు బ్యాంకు ఉంది. అయితే, ఇంతకాలం రాజకీయ పార్టీలు తమను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకున్నాయని, సరైన గుర్తింపు ఇవ్వలేదని ఆ వర్గంలో తీవ్ర ఆవేదన వ్యక్తమవుతోంది. ఈ తరుణంలో గెలుపోటములను నిర్దేశించే స్థాయిలో ఉన్న ఈ ప్రధాన సామాజికవర్గం చదువుకున్న, చురుకైన యువ నాయకుడు ఉదయ్‌ను తమ ప్రతినిధిగా నిలబెట్టేందుకు ఏకమవుతున్నట్లు తెలుస్తోంది.

### - మూడు నియోజకవర్గాల్లో నెట్‌వర్క్..

### యువతలో తిరుగులేని పట్టు

నగర పరిధిలోని మూడు నియోజకవర్గాల ప్రజలతో, ముఖ్యంగా యువతతో ఉదయ్ కుమార్‌కు నిరంతర బంధం ఉంది. విద్యార్థి దశ నుంచే సమస్యలపై పోరాడిన అనుభవం ఉండటంతో యువతలో ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. నిరుద్యోగ సమస్యలపై, స్థానిక సమస్యలపై ఆయన చేసిన పోరాటాలు, కరోనా కష్టకాలంలో గ్రామాల్లో ఆయన అందించిన నిరుపమాన సేవలు ప్రజల హృదయాల్లో బలమైన ముద్రగా మారాయి.

### - ఆధునిక పాలన.. నగర అభివృద్ధిపై స్పష్టమైన విజన్ :

గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి, వృత్తిపరమైన నేపథ్యం కలిగిన ఉదయ్.. కర్నూలు నగర సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులపై పూర్తి అవగాహన కలిగిన నేత. ఆధునిక నగర పాలనకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం ఆయన సొంతం. కర్నూలు పట్టణ మౌలిక వసతుల కల్పన, పారిశుధ్య నిర్వహణ,



ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, టూరిజం డెవలప్‌మెంట్, నగర విస్తరణపై ఆయన వద్ద స్పష్టమైన రోడ్ మ్యాప్ ఉంది. డిజిటల్ యుగంలో నగర రూపురేఖలు మార్చగల సత్తా ఉన్న నాయకుడిగా యువత ఆయనను ఓన్ చేసుకుంటోంది.

### - ఢిల్లీ స్థాయిలో పరిచయాలు.. జాతీయ నేతలతో అనుబంధం

స్థానిక సమస్యలపైనే కాకుండా, జాతీయ స్థాయి నేతలతోనూ ఉదయ్‌కు మంచి సత్సంబంధాలు ఉన్నాయి. 2018లోనే ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఢిల్లీ వెళ్లిన ఉదయ్ , కేంద్ర రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయల్తో ప్రత్యేకంగా సమావేశమై పలు కీలక అంశాలపై చర్చించారు. ఇంతటి రాజకీయ చాణక్యం, సేవా నిరతి కలిగిన బెస్త ఉదయ్ కుమార్ మేయర్ పీఠాన్ని అధిరోహిస్తే కర్నూలు నగర భాగ్యరేఖలు మారుతాయని నగర ప్రజలు బలంగా ఆశిస్తున్నారు. త్వరలోనే కూటమి ప్రభుత్వం తరుపున బీజేపీ టీడీపీ జనసేన ఉమ్మడి మేయర్ అభ్యర్థిగా ఉదయ్ పేరు ఖరారు అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో కార్పొరేటర్ స్థానం కోసం డివిజన్ ను త్వరలోనే ఎంచుకునే అవకాశాలు ఉన్నట్లు పొలిటికల్ వర్గాలు అంటున్నాయి.

# రోడ్డు లేని ఫంక్షన్ హాల్ కు అనుమతులా.?

### హెచ్ ఎం డి ఎ లీలలు

### సెట్ బ్యాక్ లేదు.. రోడ్డు లేదు..

### అయిన అనుమతులు

### చివరకు హైకోర్టు జోక్యం

మేడ్చల్( ప్రశ్న న్యూస్ ) ఆ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి రోడ్డే లేదు... సెట్ బ్యాక్ ఏ మాత్రం లేదు. అయినా హెచ్ఎండిఏ అధికారులు అనుమతులు ఇచ్చారట. ఏదైనా నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలంటే దానికి కచ్చితంగా రోడ్డు ఉండాల్సి ఉంటుంది. అంతేకాకుండా సెట్ బ్యాక్ చేసి నిర్మాణాన్ని సాగిస్తేనే హెచ్ఎండిఏ అనుమతులు ఇస్తుంది. కానీ మేడ్చల్ సర్కిల్ గుండ్ల పోచంపల్లి డివిజన్ పరిధిలో కండ్లకోయ శివారులోని 226/ ఎ ఎ సర్వే నెంబర్ లో ఒక ఎకరం 34 గుంటల స్థలంలో ఫంక్షన్ హాల్ నిర్మాణం సాగుతుంది. ఈ ఫంక్షన్ హాల్ కు వెళ్లడానికి సరైన మార్గం లేదు. సెట్ బ్యాక్ అంటూ ఏమీ లేదు. నిర్మాణం మాత్రం కొనసాగుతుంది. ఆ ఫంక్షన్ హాల్ యజమాని మాత్రం తనుకు హెచ్ఎండిఏ అనుమతులు ఉన్నాయి అంటూ చెప్పుకుంటూ నిర్మాణ పనులను కొనసాగిస్తున్నారు. గత 2023 ఎన్నికల ముందు అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం, హెచ్ఎండిఏ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి అనుమతులు ఇచ్చేలా ఆదేశాలు ఇచ్చారని. రోడ్డు ఉందా... స్టేట్ బ్యాంక్... అన్న నిబంధనలను చూడకుండా అనుమతుల కోసం హెచ్ఎంబీఏ కు దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి అనుమతులు ఇచ్చారని. దీనిని ఆసరా చేసుకొని సదరు ఫంక్షన్ హాల్ యజమాని అనుమతులు తీసుకొని ఉండి ఉంటారని పలువురు భావిస్తున్నారు. అయితే ఇటీవల నిబంధనలకు విరుద్ధంగా ఫంక్షన్ హాల్ నిర్మాణం సాగుతుందని ఇటీవల టౌన్ ప్లానింగ్ అధికారులు సీజ్ సైతం చేశారు.ఫంక్షన్ హాల్ నిర్మాణాన్ని టౌన్ ప్లానింగ్ అధికారులు సీజ్ చేసినప్పటికీ మళ్లీ యధావిధిగా నిర్మాణ పనులను కొనసాగిస్తున్నారు.

### ఈ అక్రమ ఫంక్షన్ హాల్ నిర్మాణం పై అధికారులకు ఫిర్యాదులు

ఈ అక్రమ ఫంక్షన్ హాల్ నిర్మాణం పై అధికారులకు సైతం ఫిర్యాదు చేశారు. మున్సిపల్ ప్రిన్సిపల్ సెక్రెటరీ, సైబరాబాద్ కమిషనర్, కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ కు, మేడ్చల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కు అప్పన్న గారి రామిరెడ్డి ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా ఈ అక్రమ ఫంక్షన్ హాల్ పై హైకోర్టులో సైతం పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన హైకోర్టు అక్రమ ఫంక్షన్ హాల్ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలి అంటూ సంబంధిత అధికారులను ఆదేశించారు. అయినా నిర్మాణ పనులు ఆగకపోవడంతో కోర్టు ధిక్కరణ కింద సదరు రాంరెడ్డి అధికారులకు సైతం నోటీసులు పంపినట్టు సమాచారం.

### విద్యుత్ చౌర్యానికి పాల్పడ్డ చర్యలు శూన్యం

ఈ ఫంక్షన్ హాల్ నిర్మాణం కోసం సదరు ఫంక్షన్ హాల్ యజమాని విద్యుత్ చౌర్యానికి పాల్పడ్డ సంబంధిత అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరించారని ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఈ విద్యుత్ చోర్యంపై విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదులు సైతం వెళ్లిన తూతూ మంత్రంగా విచారణ జరిపి... అబ్బే అలాంటిది ఏమీ లేదు అంటూ... చేతులు దులుపుకొని వెళ్లారని స్థానికులు ఆరోపిస్తున్నారు.



అయితే దాదాపు సంవత్సరం పాటు విద్యుత్ చౌర్యానికి పాల్పడ్డ విద్యుత్ శాఖ అధికారులు దీని వైపు కన్నెత్తి చూడకపోవడం పై అప్పట్లో జోరుగా ఆరోపణలు వినిపించాయి. ఫంక్షన్ హాల్ యజమానికి విద్యుత్ శాఖ అధికారుల మధ్య కుదిరిన ఒప్పందంతోనే విద్యుత్ శాఖ అధికారులు ఈ ఫంక్షన్ హాల్ పై చర్యలు తీసుకోలేదని అప్పట్లో ఆరోపణలు జోరుగా వినిపించాయి.

## ఓ ఆర్ ఆర్ పై ఘోర రోడ్డు ప్రమాదం

# ముగ్గురు మృతి




మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) మేడ్చల్ జిల్లా శామీర్పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కీసర శామీర్పేట్ ఓఆర్ఆర్ పై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందారు. శామీర్పేట పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాచారం కు చెందిన అశోక్ లేలాండ్ మినీ వ్యాన్ టైర్ పంచర్ కావడంతో వాహనాన్ని ఓ ఆర్ ఆర్ పక్కన నిలిపి టైరు మార్చే పనిలో ఉన్నారు. అదే సమయంలో వెనుక నుండి దూసుకొచ్చిన ట్రక్కు మినీ వ్యాన్ ను ఢీ కొట్టింది.ఈ ఘటనలో వ్యాను పూర్తిగా ధ్వంసం కాగా, వ్యాన్ వద్దనే ఉన్న నాచారం కు చెందిన రింకు, ఇస్మాయిల్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడ్డ ఇబ్రహీం ను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. సమాచారం అందుకున్న షామీర్పేట్ పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. శామీర్పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## అయ్యప్ప స్వామి ఆలయంలో

# గణపతికి అభిషేకాలు



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) గజ్వేల్ శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు శనివారం లక్ష్మారెడ్డి వెంకటలక్ష్మి దంపతులు వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో గణపతికి పంచామృత అభిషేకాలు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా అయ్యప్ప దీక్ష ప్రచార సమితి అధ్యక్షులు ఎర్రం శ్రీనివాస్ గురు స్వామి మాట్లాడుతూ, హరిహర పుత్ర అయ్యప్ప స్వామి కరుణాకటాక్షాలు అందరిపై ఉండాలని కోరుకుంటూ, వినాయక నవరాత్రుల సందర్భంగా, ప్రతిరోజు ఆలయంలో గణపతికి దంపతుల ఆధ్వర్యంలో పంచామృత అభిషేకాలు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి స్వామివారి అనుగ్రహం ఉంటుందని అన్నారు, ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు జగ్గయ్యగారి శేఖర్, కోశాధికారి నారాయణరెడ్డి, వినయ్ కుమార్ రెడ్డి, గందె యాదగిరి, కైలాస ప్రశాంత్, అంజయ్య, గంగ రమేష్, గందే సంతోష్, ఆలయ కమిటీ సభ్యులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు

# విశ్వకర్మ జయంతికి క్రీడా కిరీటం

**- పాట్ మార్కెట్‌లో బెంగాలీ కార్మికుల క్రికెట్ జోష్..**

**రాక్ స్టార్‌పై రాయల్ స్టార్ ఘన విజయం**

సికింద్రాబాద్(ప్రశ్న న్యూస్) విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని సికింద్రాబాద్ పాట్ మార్కెట్‌లో పనిచేస్తున్న బెంగాలీ కార్మికుల ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ఘనంగా నిర్వహించారు. ఏకే టోర్నమెంట్ ఆధ్వర్యంలో అన్సర్ అలీ మాలిక్ నేతృత్వంలో నిర్వహించిన ఈ క్రీడా పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగాయి. పలు జట్లు పోటాపోటీగా పాల్గొని తమ క్రీడా ప్రతిభను చాటుకున్నాయి.



### ముఖ్య అతిథులుగా 95 న్యూస్ ప్రతినిధులు

ఈ కార్యక్రమానికి 95 న్యూస్ ఛానల్ చైర్మన్ ఎస్కే సిరాజుల్ గారు, 95 న్యూస్ బ్యూరో హెడ్ ఖమ్మం పార్టీ సాయి చంద్ర గౌడ్ గారు ముఖ్య అతిథులుగా పాల్గొని క్రీడాకారులను అభినందించారు. టోర్నమెంట్‌ను వీక్షిస్తూ క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపారు. యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవడంతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, సమిష్టి భావనను అలవర్చుకోవాలని సూచించారు.

### రాక్ స్టార్ - రాయల్ స్టార్ మధ్య హోరాహోరీ పోరు


టోర్నమెంట్‌లో భాగంగా రాక్ స్టార్, రాయల్ స్టార్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగింది. ఇరు జట్ల క్రీడాకారులు విజయం కోసం హోరాహోరీగా పోరాడటంతో మ్యాచ్‌ను తిలకించిన అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. చివరకు రాయల్ స్టార్ జట్టు విజయం సాధించడంతో క్రీడాకారులు, అభిమానులు, నిర్వాహకుల్లో సంబరాలు నెలకొన్నాయి.

### యువతలో క్రీడా స్ఫూర్తి పెంపే లక్ష్యం

ప్రతి సంవత్సరం విశ్వకర్మ జయంతి సందర్భంగా ఇలాంటి క్రీడా కార్యక్రమాలను నిర్వహిస్తున్న అన్సర్ అలీ మాలిక్‌కు టీం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల మధ్య స్నేహభావం, ఐక్యతను పెంపొందించడంతో పాటు యువతలో క్రీడా స్ఫూర్తిని పెంచేందుకు ఇలాంటి టోర్నమెంట్లు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అన్సర్ అలీ మాలిక్ మాట్లాడుతూ.. యువతలో క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు, క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ఏకే టోర్నమెంట్ ఆధ్వర్యంలో భవిష్యత్తులో మరిన్ని క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహిస్తామని తెలిపారు. యువతను క్రీడల వైపు ప్రోత్సహించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ క్రికెట్ టోర్నమెంట్‌తో పాట్ మార్కెట్ పరిసరాల్లో పండుగ వాతావరణం నెలకొంది. క్రీడాకారులు, నిర్వాహకులు, అభిమానుల సందడితో కార్యక్రమం ఉత్సాహంగా సాగింది.

# కొల్లూరు బ్లోసమ్ హైట్స్‌లో ఘనంగా గణేష్ పూజ

**అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ రఘునందన్ రావు**



శేర్లింగంపల్లి(ప్రశ్న న్యూస్) కొల్లూరు బ్లోసమ్ హైట్స్ అపార్ట్‌మెంట్‌లో గణేష్ పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. వెలిమల ప్రమోద్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ.. గణనాథుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అపార్ట్‌మెంట్ వాసులు, నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.కావాలంటే ఇదే వార్తను పేపర్‌లో వచ్చేలా మరింత ఘాటైన హెడ్‌లైన్‌తో కూడా మార్చి ఇవ్వగలను.

# మల్లికార్జున్ నగర్‌లో ఘనంగా గణనాథుని పూజలు



నాచారం (ప్రశ్న న్యూస్) మల్లాపూర్ శక్తిసాయినగర్ డివిజన్ పరిధిలోని మల్లికార్జున్ నగర్ కాలనీలో గణేష్ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. బీజేపీ మేడ్చల్ డిస్ట్రిక్ట్ కౌన్సిల్ మెంబర్ సంగిశెట్టి రవీంద్ర సాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వేముల రాజు దంపతులు, వేముల రమేష్ దంపతులు గణపయ్యను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు గణనాథునికి పుష్పాలు, పండ్లు సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. వినాయకుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. కాలనీలో ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించేందుకు నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గణపతి బప్పా మోరియా నినాదాలతో మల్లికార్జున్ నగర్ మార్మోగింది.

# ట్రాఫిక్ నిర్వహణపై సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులకు ప్రత్యేక శిక్షణ

శేరిలింగంపల్లి(ప్రశ్న న్యూస్) సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసు అధికారులకు ట్రాఫిక్ ఇంజినీరింగ్, రహదారి భద్రత, ప్రవర్తనా శాస్త్రం, ట్రాఫిక్ ప్రవాహ నిర్వహణపై రెండో రోజు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్ నిర్వహణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడంతో పాటు శాస్త్రీయ, ఆచరణాత్మక విధానాలను బలోపేతం చేయడమే శిక్షణ ఉద్దేశమని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఐపీఎస్, ట్రాఫిక్ డీసీపీ–2 ఎస్. శేషాద్రిణి రెడ్డి ఐపీఎస్, ఎస్‌సీఎస్‌సీ సీఈవో నవేద్ ఖాన్‌తో పాటు పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.శిక్షణలో ట్రాఫిక్ ప్రవాహం, వాహనాల క్యూలు, ఆలస్యం, వేగం–ట్రాఫిక్ ప్రవాహ సంబంధం, ప్యాసింజర్ కార్ యూనిట్లు, వాల్యూమ్–కెపాసిటీ నిష్పత్తులు, కాంట్రా ఫ్లో వంటి అంశాలను వివరించారు. అలాగే ప్రవర్తనా శాస్త్రం, కార్పొరేట్ ప్రయాణ విధానాల్లో మార్పులు తీసుకురావడానికి ప్రోత్సాహకాలు, సామాజిక ప్రభావం, గేమిఫికేషన్ వంటి విధానాలపై అవగాహన కల్పించారు.రోడ్డు ప్రమాదాలకు దారితీసే కారణాలు, వాహన వేగం–మరణ ప్రమాదం మధ్య సంబంధం, ట్రాఫిక్ ప్రవాహ సమన్వయం, రహదారి భద్రత చర్యలు, అమలు వ్యూహాలపై శిక్షణ ఇచ్చారు. జంక్షన్ రూపకల్పనలో ట్రాఫిక్ డిమాండ్, సంఘర్షణ ప్రాంతాలు, వాహనాల లెక్కింపు, సిగ్నల్ దశలు, నాలుగు మార్గాల సిగ్నల్ జంక్షన్ల నిర్మాణ విధానాలను వివరించారు. సిగ్నల్ దశలు, సమయ నియంత్రణ, పలు సిగ్నళ్ల సమన్వయం, నేరుగా వెళ్లే మరియు మలుపు తిరిగే వాహనాల పరిమాణం వంటి అంశాలను కూడా శిక్షణలో చర్చించారు. ఈ సందర్భంగా సన్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ.. దేశంలోనే తొలిసారిగా ఇలాంటి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రహదారి ఇంజినీరింగ్, అభివృద్ధి పనులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.



### జంక్షన్ల వద్ద అడ్డంకులే ప్రధాన సమస్యలు


జంక్షన్లలో, పరిసర ప్రాంతాల్లో భౌతిక, దృశ్యపరమైన అడ్డంకులు ట్రాఫిక్ రద్దీకి ప్రధాన కారణాల్లో ఒకటని జాయింట్ కమిషనర్ పేర్కొన్నారు. ఇలాంటి అడ్డంకులను తొలగించడం లేదా క్రమబద్ధీకరించడం ద్వారా వాహనాల ప్రవాహాన్ని మెరుగుపరచడంతో పాటు వేచి ఉండే సమయాన్ని తగ్గించవచ్చన్నారు. ప్రతి అధికారి, క్షేత్రస్థాయి సిబ్బంది తమ పరిధిలోని ట్రాఫిక్ ప్రాంతాలు, జంక్షన్లు, ప్రధాన మార్గాలను సమగ్రంగా పరిశీలించాలని ఆదేశించారు. రద్దీ ప్రాంతాలు, ఇరుకైన మార్గాలు, అడ్డంకులు ఉన్న ప్రదేశాలను గుర్తించి క్షేత్రస్థాయి నివేదికలు, సూచనలు, కార్యాచరణ ప్రణాళికలను ఉన్నతాధికారులకు త్వరగా అందించాలని సూచించారు. జంక్షన్లను పరిశుభ్రంగా, క్రమబద్ధంగా, అడ్డంకులు లేకుండా నిర్వహించడం ద్వారా ట్రాఫిక్ నియంత్రణ మరింత సమర్థవంతంగా మారుతుందని తెలిపారు.


# ఊపిరిపీల్చుకున్న స్థానికులు

శేర్లింగంపల్లి (ప్రశ్న న్యూస్) శేర్లింగంపల్లి సర్కిల్–49, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గోపనపల్లి ఎన్టీఆర్ నగర్‌లో శుక్రవారం భవనం పక్కకు ఒరిగిన ఘటనతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

భవనం మరింతగా ఒరిగి ప్రమాదం జరిగే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమైంది. అయితే ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. శనివారం హైడ్రా అధికారులు భారీ యంత్రాలను రంగంలోకి దించి ప్రమాదకరంగా ఉన్న భవనాన్ని కూల్చివేశారు. దీంతో చుట్టుపక్కల ప్రాంతానికి ఉన్న ముప్పు తొలగడంతో స్థానికులు ఊరట చెందారు. ఈ ఘటన నేపథ్యంలో శేర్లింగంపల్లి సర్కిల్–49 పరిధిలో జరుగుతున్న నిర్మాణాలపై అధికారులు మరింత నిఘా పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

భవన నిర్మాణ అనుమతులు, నిబంధనల అమలు, నిర్మాణ భద్రత వంటి అంశాలను క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. నిర్మాణ దశలోనే నిబంధనల ఉల్లంఘనలను గుర్తించి చర్యలు తీసుకుంటే ఇలాంటి ప్రమాదాలను ముందుగానే నివారించవచ్చని స్థానికులు పేర్కొంటున్నారు.





# ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో గంగపుత్ర పట్టభద్రులు నమోదు చేసుకోవాలి

**టిజిఎస్ రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర**



హైదరాబాద్(ప్రశ్న న్యూస్) తెలంగాణ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియకు ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ప్రస్తుత ఓటర్ల జాబితాలో పేర్లు ఉన్న పట్టభద్రులు కూడా కొత్తగా సవరించిన ఫారం–18లో తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసినట్లు తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర తెలిపారు. దరఖాస్తుతో పాటు అవసరమైన ధ్రువపత్రాలు సర్టిఫికెట్ల ధృవీకరించిన కాపీలను సమర్పించాలని సూచించారు మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గాల పరిధిలోని గంగపుత్ర పట్టభద్రులు విధిగా తమ ఓటును నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా ఫారం–18ను పూర్తి చేసి, అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని రాజేష్ ఖన్నా గంగపుత్ర విజ్ఞప్తి చేశారు.

# వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా పటిష్ఠ చర్యలు

**- కుల్చారం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్**

మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) శనివారం కుల్చారం పోలీస్ స్టేషన్‌ను మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న జీడీ, పార్ట్–1, ఆల్ఫాబెటికల్ ఇండెక్స్ తదితర ముఖ్యమైన రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న సీజ్ చేసిన వాహనాలను కూడా పరిశీలించి, వాటికి సంబంధించిన కేసుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.వినాయక నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని అదనపు ఎస్పీ సిబ్బందిని ఆదేశించారు. బ్యాంకులు, ఏటీఎంలు, ప్రధాన కూడళ్ల వద్ద సమర్థవంతంగా పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. ఆస్తి సంబంధిత నేరాల నివారణకు ముఖ్యమైన ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజల పట్ల మర్యాదగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలని సూచించారు.ప్రతి ఫిర్యాదును నిబంధనల ప్రకారం స్వీకరించి, బాధితులకు సత్వర న్యాయం అందేలా తక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. కేసులకు సంబంధించిన ఆధారాలను నిబంధనల ప్రకారం ఈ–సాక్ష్యలో నమోదు చేసి భద్రపరచాలని, దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు.కేసుల వివరాలను సీసీటీఎన్ఎస్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ, పోలీస్ స్టేషన్ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. పెండింగ్ నివేదికలను త్వరితగతిన పూర్తి చేయడంతోపాటు, పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని సూచించారు. కేసుల సత్వర పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు.ఈ తనిఖీలో మెదక్ రూరల్ సీఐ ఎం. కృష్ణమూర్తి, ఎస్ఐ అహ్మద్ మొహినుద్దీన్‌తో పాటు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

**- డా. పుట్ల శ్రీనివాస్**

**వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలి**



హైదరాబాద్(ప్రశ్న న్యూస్) ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని హైదరాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. పుట్ల శ్రీనివాస్ వైద్యాధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను సకాలంలో



పూర్తి చేయడంతో పాటు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. గోల్కొండ క్లస్టర్ పరిధిలోని ఫిలింనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డా. పుట్ల శ్రీనివాస్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాజరు రిజిస్టర్, రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఔషధాల లభ్యత, ల్యాబొరేటరీ కేంద్రం, వివిధ రికార్డులు, ఆరోగ్య కేంద్రంలోని పరిశుభ్రత పరిస్థితులను పరిశీలించారు. అనంతరం గర్భిణీల సంరక్షణ, శిశువులకు టీకాలు, అంటువ్యాధుల నివారణ, సీజనల్ వ్యాధుల నియంత్రణపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. మలేరియా, డెంగ్యూ, చికున్‌గునియా వంటి వ్యాధుల నియంత్రణకు ఇంటింటి ఆరోగ్య సర్వేలను సమర్థవంతంగా నిర్వహించి, ప్రజలకు వ్యాధుల నివారణపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.అంటువ్యాధుల సర్వే, స్క్రీనింగ్, ఫాలోఅప్ కార్యక్రమాలను ప్రతిరోజూ నిర్వహించాలని, ప్రభుత్వ ఆరోగ్య పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హుడికి చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చూడాలని స్పష్టం చేశారు.ఈ తనిఖీలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. సాయిబాబా, గోల్కొండ క్లస్టర్ సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డా. మురళీధర్, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# దసరా టికెట్ల పేరుతో మోసం

- పాత పూజా టికెట్ తేదీలు మార్చి విక్రయం
- రూ.3,500 'శ్రీచక్రార్చన' టికెట్‌తో భక్తురాలికి వల
- పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన ఇంద్రకీలాద్రి ఈవో శీనా నాయక్
- దసరా ప్రత్యేక పూజల టికెట్ కోటా ఇంకా విడుదల కాలేదని స్పష్టీకరణ

**విజయవాడ(ప్రశ్న న్యూస్)** దసరా నవరాత్రి మహోత్సవాలను ఆసరాగా చేసుకుని భక్తులను మోసం చేసేందుకు నకిలీ పూజా టికెట్లను విక్రయిస్తున్న వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాల సందర్భంగా నిర్వహించే ప్రత్యేక పూజల పేరుతో పాత పూజా టికెట్లపై తేదీలు, ఇతర వివరాలు మార్చి కొత్త టికెట్లుగా చలామణి చేస్తున్నట్లు దేవస్థానం గుర్తించింది. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని దేవస్థానం ఈవో వి.కె. శీనా నాయక్ విజయవాడ నగర పోలీస్ కమిషనర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.



**అనుమానం రావడంతో వెలుగులోకి..** కావలికి చెందిన ఓ మహిళా భక్తురాలు సెప్టెంబరు 16న దసరా ఉత్సవాలకు సంబంధించినదిగా చెబుతూ 18-10-2026 తేదీతో రూ.3,500 విలువైన ఆఫ్‌లైన్ 'శ్రీచక్రార్చన' టికెట్ కొనుగోలు చేశారు. అయితే టికెట్‌పై అనుమానం రావడంతో దాని నిజానిజాలను నిర్ధారించుకునేందుకు దేవస్థానం ఐటీ విభాగాన్ని సంప్రదించారు.అక్కడి నుంచి వచ్చిన సమాధానంతో అసలు విషయం బయటపడింది. దసరా ఉత్సవాలకు సంబంధించి దేవస్థానం ఇంకా ఎలాంటి ఆన్‌లైన్ టికెట్ కోటాను విడుదల చేయలేదని, ఆఫ్‌లైన్ టికెట్ల విక్రయాలు కూడా ప్రారంభించలేదని ఐటీ విభాగం స్పష్టం చేసింది.దీంతో భక్తురాలు కొనుగోలు చేసిన టికెట్ నకిలీదని నిర్ధారణ కావడంతో విషయాన్ని వెంటనే ఈవో దృష్టికి తీసుకెళ్లారు.

**'శర్మ' వద్ద కొనుగోలు చేశానని..** తనకు తెలిసిన వ్యక్తి ద్వారా ఆలయ ప్రాంగణంలో ఉండే 'శర్మ' అనే వ్యక్తి నుంచి టికెట్ కొనుగోలు చేసినట్లు మహిళ దేవస్థాన అధికారులకు తెలిపినట్లు ప్రకటనలో పేర్కొన్నారు. అయితే సదరు వ్యక్తికి సంబంధించిన పూర్తి వివరాలు తనకు తెలియవని ఆమె వెల్లడించారు.టికెట్‌ను పరిశీలించిన దేవస్థాన అధికారులు.. పాత పూజా టికెట్‌పై తేదీ, ఇతర వివరాలను మార్చినట్లుగా గుర్తించినట్లు తెలిపారు.దసరా మహోత్సవాలకు ఇంకా టికెట్ కోటా విడుదల చేయకముందే ఈ తరహా టికెట్ భక్తురాలి చేతికి ఎలా వచ్చిందనే అంశంపై పోలీసులు దర్యాప్తు చేయాల్సి ఉంది.

**పోలీసులకు దేవస్థానం ఫిర్యాదు** వ్యవహారం వెలుగులోకి వచ్చిన వెంటనే ఈవో శీనా నాయక్ స్పందించారు. భక్తులను మోసం చేస్తున్న వ్యక్తులు లేదా ముఠాపై సమగ్ర విచారణ జరిపి, ఈ వ్యవహారంలో ఉన్న వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ విజయవాడ నగర పోలీస్ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు.దసరా మహోత్సవాలకు దేశం నలుమూలల నుంచి భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో నకిలీ టికెట్ల వ్యవహారంపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని దేవస్థానం సూచించింది.ఇంకా టికెట్ కోటా విడుదల కాలేదు దసరా నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలుగా నిర్వహించే కుంకుమార్చన, శ్రీచక్రార్చన, చండీహోమం తదితర సేవలకు సంబంధించిన టికెట్ కోటాను దేవస్థానం ఇంకా విడుదల చేయలేదని ఈవో స్పష్టం చేశారు.

టికెట్ల కోటా ఎప్పుడు విడుదల చేస్తారనే విషయాన్ని మీడియా ద్వారా ముందుగానే భక్తులకు తెలియజేస్తామని దేవస్థానం ప్రకటించింది.

అందువల్ల అధికారిక ప్రకటన రాకముందే బయట వ్యక్తులు, దళారులు, మధ్యవర్తులు చెబుతున్న మాటలు నమ్మి టికెట్లు కొనుగోలు చేయవద్దని భక్తులను కోరింది.

**ఆన్‌లైన్‌లోనే ఆర్జిత సేవల టికెట్లు** దేవస్థానంలో నిర్వహించే ఆర్జిత సేవలు, పూజలు, దర్శనాలకు సంబంధించిన టికెట్లను పారదర్శకమైన అధికారిక వ్యవస్థ ద్వారానే జారీ చేస్తామని అధికారులు తెలిపారు. దేవస్థానం సూచించిన అధికారిక మార్గాలను మాత్రమే భక్తులు వినియోగించాలని పేర్కొన్నారు.

**అధికారిక వెబ్‌సైట్..**'వాట్సాప్ మన మిత్ర'..దేవస్థానం నిర్దేశించిన కౌంటర్లు..ఇవే భక్తులు ఆధారపడాల్సిన అధికారిక మార్గాలని స్పష్టం చేశారు.దళారులను నమ్మొద్దుదసరా ఉత్సవాల సందర్భంగా పూజలు, దర్శనాల కోసం భారీగా డిమాండ్ ఉంటుందని భావించి కొందరు దళారులు భక్తులను లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉందని దేవస్థానం హెచ్చరించింది.

**'టికెట్ ముందే ఇప్పిస్తాం'..**

**'కోటా అయిపోయింది.. మా దగ్గర ఉంది'..**

**'ప్రత్యేక దర్శనం ఇప్పిస్తాం'..**

**'ఆఫ్‌లైన్ టికెట్'..**

అంటూ ఎవరైనా డబ్బులు అడిగితే అప్రమత్తంగా ఉండాలని సూచించింది.ముఖ్యంగా దేవస్థానం అధికారికంగా టికెట్ కోటా విడుదల చేయకముందే ఎవరి వద్ద నుంచైనా టికెట్ లభిస్తే దాని నిజానిజాలను తప్పనిసరిగా నిర్ధారించుకోవాలని అధికారులు కోరారు.భక్తులారా.. అప్రమత్తందసరా మహోత్సవాలు సమీపిస్తున్న తరుణంలో నకిలీ టికెట్ల వ్యవహారం వెలుగులోకి రావడంతో భక్తులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఏర్పడింది.టికెట్‌పై దేవస్థానం పేరు, తేదీ, ధర, పూజ వివరాలు ఉన్నాయనే కారణంతో అది అసలైన టికెట్ అని భావించకూడదు. అధికారిక వ్యవస్థలో ధ్రువీకరించుకున్న తర్వాతే టికెట్ నిజమైనదో కాదో నిర్ధారించుకోవాలి.ఎవరైనా దేవస్థానం పేరుతో దర్శనం లేదా పూజా టికెట్లు విక్రయిస్తున్నట్లు గుర్తించినా, అనుమానాస్పదంగా వ్యవహరిస్తున్నా వెంటనే దేవస్థానం అధికారులకు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఈవో కోరారు.

టికెట్ కోటా విడుదల కాలేదుకుంకుమార్చన, శ్రీచక్రార్చన, చండీహోమం తదితర ప్రత్యేక పూజల టికెట్ల కోటాను దేవస్థానం ఇంకా విడుదల చేయలేదు. అధికారిక ప్రకటన వచ్చే వరకు బయట వ్యక్తుల నుంచి టికెట్లు కొనుగోలు చేయొద్దు.

# గరుడుడెక్కిన గోవిందుడు

- తిరుమాడ వీధుల్లో భక్తజన గోవింద నామఘోష.. వైభవంగా గరుడసేవ



**తిరుమల(ప్రశ్న న్యూస్)** తిరుమల కొండపై భక్తి వెల్లివిరిసింది. సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ఐదో రోజైన శనివారం రాత్రి గరుడసేవ వైభవంగా జరిగింది. విశేషంగా అలంకరించిన గరుడ వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి దర్శనం కోసం తిరుమాడ వీధుల్లో వేచిఉన్న భక్తులు 'గోవిందా.. గోవిందా..' అంటూ నామస్మరణలతో మార్మోగించారు.గజరాజులు ముందు నడవగా.. భక్తబృందాల భజనలు, కోలాటాలు, జీయ్యంగార్ల ఘోష, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు సాగింది. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పిస్తూ స్వామివారిని దర్శించుకున్నారు.

**గరుడసేవకు ప్రత్యేక ప్రాశస్త్యం** 108 వైష్ణవ దివ్యదేశాల్లో గరుడసేవకు విశిష్టమైన ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఉంది. గరుడుడు జ్ఞాన, వైరాగ్యాలకు ప్రతీకగా భావిస్తారు. గరుడ వాహనంపై శ్రీవారిని దర్శించుకుంటే సర్వపాప ప్రాయశ్చిత్తం, జ్ఞానవైరాగ్య ప్రాప్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం.

**ప్రముఖుల హాజరు** గరుడసేవలో తిరుమల పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఛైర్మన్ బి.ఆర్. నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, జిల్లా కలెక్టర్ డా. ఎస్. వేంకటేశ్వర్, జేఈవోలు డా. ఎ. శరత్, ప్రభల గోపీనాథ్, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, సీవీఎస్వో కె.వి. మురళీకృష్ణ, ఎస్వీబీసీ ఛైర్మన్ శ్రీధర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

# గరుడసేవ.. ఏర్పాట్లపై నిఘా

## గ్యాలరీల్లో సదుపాయాలు పరిశీలించిన టీటీడీ ఛైర్మన్ బి.ఆర్.నాయుడు





తిరుమల(ప్రశ్న న్యూస్ ) శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో అత్యంత వైభవంగా జరిగే గరుడవాహన సేవను పురస్కరించుకుని టీటీడీ చేసిన ఏర్పాట్లను ఛైర్మన్ బి.ఆర్.నాయుడు శనివారం పరిశీలించారు. అదనపు ఈవో సీహెచ్.వెంకయ్య చౌదరి, జేఈవో డా.ఎ.శరత్, సీవీఎస్వో కె.వి.మురళీకృష్ణ, ఎస్పీ సుబ్బరాయుడు, బోర్డు సభ్యులు, ఇతర అధికారులతో కలిసి నాలుగు మాడవీధుల్లోని గ్యాలరీలను పరిశీలించారు. గరుడసేవను దర్శించేందుకు భారీగా తరలివచ్చిన భక్తులకు అందుతున్న అన్నప్రసాదం, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలను ఛైర్మన్ స్వయంగా పరిశీలించారు. భక్తులను నేరుగా అడిగి ఏర్పాట్లపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. టీటీడీ కల్పించిన సదుపాయాలపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు.

**రద్దీకి తగ్గట్టుగా చర్యలు** భక్తుల సౌకర్యం, భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు ఛైర్మన్ సూచించారు. అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలని, భక్తుల రద్దీకి అనుగుణంగా అవసరమైన చర్యలను వెంటనే చేపట్టాలని ఆదేశించారు. ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. గరుడవాహన సేవను దర్శించేందుకు భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో మాడవీధుల్లోని గ్యాలరీలు నిండిపోయాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ అధికారులు, సిబ్బంది నిరంతరం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# వెలిగల్లు ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలి

- సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ

**అన్నమయ్య/గాలివీడు** జిల్లాలోని గాలివీడు మం డలం వెలిగల్లు ప్రాజెక్టు నుండి కాలువల ద్వారా సాగునీరు అం దించి రైతాం గాన్ని తక్షణమే ఆదుకోవాలని సిపిఐ (ఎం ఎల్) లిబరేషన్ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మావు లూరి విశ్వనాథ్ బందెల ఓబ య్య సిగి చెన్నయ్య లు డిమాండ్ చేశారు శనివారం గాలివీడు టౌన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వెలిగళ్ళు ప్రాజెక్టు ద్వారా ఎక్కడికో దూరం గా సాగునీరు ఇవ్వడం మంచిదే కానీ ప్రాజెక్టు ఆనుకొని ఉన్న రైతాంగాన్ని తక్షణమే ఆదుకో వాలని గోరన్ చెరువు ఎదవ గొట్టి వీడు దిగువ వగొట్టి వీడు మాధవరం గొర్లమదీడు ఎంద పల్లి ఈ గ్రామాలకు సంబం ధించిన చెరువులకు కుంటలకు వెలిగల్లు ప్రాజెక్టు నుండి కాలు వల ద్వారా సాగనీరు వదలాలని వారు ప్రభుత్వాన్ని కోరారు ఎందుకంటే ఈ గ్రామాలలో రైతులు వ్యవసాయానికి లక్షలకు లక్షలు డబ్బులు వడ్డీలకు తెచ్చుకొని సుమారు 1000 నుంచి 1400 వరకు బోర్లు వేస్తే నీళ్లు పడడం లేదన్నారు ఒకవేళ నీళ్లు పడితే బయటికి వస్తాయని గ్యారెంటీ లేదన్నారు కనీసం తాగడానికి కూడ వాటర్ లేవన్నారు ఈ రకంగా ఈ గ్రామాల్లో ఉన్న రైతులు గోడు ప్రభుత్వం పట్టించుకోని ఈ రైతాంగాన్ని ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు అదేవిధంగా ఉపాధి అవకాశాలు కూడా లేవన్నారు బయట ప్రాంతాలకు పోయి చాలా ఇబ్బందులు పడుతూ అప్పులు పాలు అవుతున్నారని వారు గుర్తు చేశారు వెలిగుల్లు ప్రాజెక్టు నుండి కాలువల ద్వారా ఈ 6 గ్రామ పంచాయితీల రైతులను దృష్టిలో పెట్టుకొవాలన్నారు మరి ముఖ్యంగా గోరన్ చెరువు ఎగువ గొట్టివీడు దిగవ గొట్టి వీడు మాధవరం గొర్లమదీడు ఎండపల్లి గ్రామాలలో ఉన్న ప్రతి రైతు ఇప్పటికైనా మేలుకొని సాగునీటి కోసం సిపిఐ( ఎంఎల్) లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో జరిగే పోరాటానికి సిద్ధం కావా లని రైతులకు వారు పిలుపు నిచ్చారు ఈ గ్రామాలలో ప్రతి గుంటకు కనీసం నెలకు ఒకసారి నీళ్లు వదలాలని వారు కోరారు

# వేరుశెనగ విత్తనాలు 50 శాతం రాయితీపై రైతులకు ఇవ్వాలి

**కడప సిటీ** వైయస్సార్ కడప జిల్లాలో ఎల్ నీనో ప్రభావంతో ఖరీఫ్ సీజన్లో పంట పొలాలు ఖాళీగా ఉండిపోవాల్సి వచ్చింద న్నారు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్య క్షురాలు విజయ జ్యోతి. శనివా రం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం నుండి ఒక ప్రకటన విడుదల చేశారు.వైయస్సార్ కడప జిల్లాలో వర్షపాతం లోటు 50 శాతం పైగా ఉందని, వర్షా బావ పరిస్థితుల్లో 50 శాతం రాయి తీపై శనగ, వేరుశనగ విత్తనాలు ఇవ్వాలని విజయ జ్యోతి అధికా రులను కోరారు.జిల్లాలో కమలాపురం, ముద్దనూరు, పులివెందుల, ప్రొద్దుటూరు, మైదుకూరు, కడప, పోరు మామిళ్ల వ్యవసాయ డివిజన్లో దాదాపు సంవత్సరానికి శనగ పంట 75 వేల హెక్టార్ల సాగు చేస్తారని వారికి 50 శాతం రాయితీతో విత్తనాలు ఇస్తే ప్రస్తుత పరిస్థితుల్లో రైతులకు కొంత వెసులుబాటుగా ఉంటుం దని ప్రభుత్వానికి సూచించారు.అదేవిధంగా అధికారులు విత్తన పూర్తి ధర, రాయితీ, రైతు వాటా ఖర్చులు, వంగడాల సేకరణ, సరఫరా ప్రక్రియ త్వరగా ప్రారం భించాలని కోరారు.విత్తన ధర ఇంకా నిర్ణయించినందున రైతు సేవా కేంద్రాలలో విత్తనాలు కావలసిన రైతుల వివరాలను అక్కడ సిబ్బంది నమోదు చేయడం లేదని తెలిపారు.కావున ఎల్ నీనో ప్రభావంతో ఖరీఫ్ లో నష్టపోయిన రైతుల ను, అక్టోబర్లో ప్రారంభం కానున్న రబీ సీజన్లో రైతులను ఆదుకో వాలని విజయ జ్యోతి జిల్లా అధికారులకు విజ్ఞప్తి చేశారు

# పోలవరం జిల్లాకు పూర్తిస్థాయి ఎస్పీని, ప్రభుత్వ శాఖల అధికారులను వెంటనే నియమించాలి.

**రంపచోడవరం :** పోలవరం జిల్లా ఆవిర్భవించి దాదాపు ఏడాది కావొస్తున్నా, జిల్లాకు పూర్తిస్థాయి జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ (ఎస్పీ)ని నియమించకపోవడం విచారకరమని ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుజ శ్రీను ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాకు కలెక్టర్‌ను నియమించిన ప్రభుత్వం, ఎస్పీ నియామకంపై నిర్లక్ష్యం వహించడం తగదని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీనే పోలవరం జిల్లాకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తుండటంతో, శాంతిభద్రతల పర్యవేక్షణ తగ్గిపోతోందని శ్రీను ఆందోళన వ్యక్తం చేశారు. దీనివలన అనేక పోలీస్ స్టేషన్లలో బాధితుల ఫిర్యాదులపై తగిన చర్యలు లేక కేసులు పెండింగ్‌లో ఉండిపోతున్నాయని, ప్రజలు నెలల తరబడి స్టేషన్ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. జిల్లా ఎస్పీ అందుబాటులో ఉంటే, క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యంపై నేరుగా ఉన్నతాధికారికి విన్నవించుకునే అవకాశం బాధితులకు కలుగుతుందని అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని సివిల్ వివాదాల్లో కూడా కొన్ని చోట్ల స్థానిక పోలీసులు అనవసర జోక్యం చేసుకుంటున్నారని విమర్శించారు.

# శ్రీవారిని దర్శించుకున్న గవర్నర్

**తిరుమల** తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ఏపీ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ దర్శించుకున్నారు. తొలుత శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు అధికారులు ఘన స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో గవర్నర్ కు పండితులు వేదాశీర్వచనం చేయగా.. అధికారులు ఆయనకు స్వామివారి చిత్రపటంతోపాటు తీర్థప్రసాదాలను అందజేశారు.

# గంజాయి స్వాధీనం..ఐదుగురు అరెస్టు

**మార్కాపురం** మార్కాపురం పట్టణ శివార్లలో పోలీసులు గంజాయిని పట్టుకున్నారు. సాయిబాలాజీ థియేటర్ సమీపంలోని కంపచెట్లలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి కిలో గంజాయితో పాటు ఆటోను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి కలిగి ఉన్న ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. మరో వ్యక్తి అక్కడి నుంచి పరారైనట్లు, అతని కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నట్లు వెల్లడించారు. అరెస్టయిన వారిలో విజయ్, జాన్‌బాషా, చాంద్‌బాషాలపై గతంలో కేసులు నమోదై ఉండటంతో పాటు సస్పెక్ట్ షీట్లు ఉన్నట్లు డీఎస్పీ డాక్టర్ యు. నాగరాజు తెలిపారు. మార్కాపురం పట్టణంలో గంజాయి విక్రయం, వినియోగంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో సీఐ ఎం.డి. కె. అల్తాఫ్ హుస్సేన్, పట్టణ ఎస్సై పి. విశ్వనాథరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఆత్మకూరులో మంత్రి ఆనం పర్యటన

**నెల్లూరు** నెల్లూరు ఆత్మకూరు నియోజకవర్గంలో విద్యారంగాన్ని మరింత పటిష్టం చేసేలా, విద్యార్థులకు ఉపాధ్యాయులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించే లక్ష్యంతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి శ్రీకారం చుట్టారు.ఇందులో భాగంగా ఆత్మకూరులోని వెస్ట్ ఎంపీపీఎస్ పాఠశాల ప్రాంగణంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం 28.30 లక్షల వ్యయంతో నిర్మించిన భవిత భవనాన్ని చిన్నారులతో కలిసి ప్రారంభించారు.అలాగే, ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో 53 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక వనరుల కేంద్రం మండల విద్యాశాఖ అధికారి కార్యాలయ భవనాలను జాతికి అంకితం చేశారు.విద్యార్థులకు నాణ్యమైన వాతావరణాన్ని అందించడమే మన కూటమి ప్రభుత్వ ధ్యేయమని మంత్రి తెలిపారు.

# జిల్లా సమిక్షా కమిటీ సమావేశం

- పాల్గోన్న మంత్రి కందుల దుర్గేష్

**గుంటూరు** గుంటూరు జిల్లా సమిక్ష కమిటీ సమావేశంలో ఇంచార్జి మంత్రి కందుల దుర్గేష్ పలు అంశాలపై చర్చించారు.ఎల్ నినో ప్రభావం, ఎరువుల కొరత,పంట మద్దతు ధర,నిత్యావసర వస్తు ధరలు, కౌలు రైతుల సమస్యలపై అధికారులకు కీలన ఆదేశాలు జారీ చేశారు.జల్ జీవన్ మిషన్ 2.0 పనులు, ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ లకు దరఖాస్తుల స్వీకరణ, సూపర్ సిక్స్ పథకాల అమలు తీరు తదితర పై చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

# వివాహిత మహిళపై జనసేన పార్టీ నాయకుడు దాడి

**మైలవరం** మైలవరం మండలం కొత్తగూడెం గ్రామం లో వివాహిత మహిళపై జనసేన పార్టీ నాయకుడు దాడి చేసాడు. భర్త లేని సమయం తెలుసుకొని తన అనుచరులతో ఎడ్ల సూధాకర్ మహిళా పై బలాత్కారం చేయబోయాడు. మహిళ ఎదురు తిరగడంతో తీవ్రంగా గాయపరిచి పారిపోయాడు. ఘటనను గమనించిన బంధువులు బాధిత మహిళను ఆస్పత్రిలో చేర్పించారు. కుటుంబ సభ్యులు మైలవరం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసారు. గతంలో పలు సందర్భాల్లో తన భార్య పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని భర్త కందుల పూర్ణచంద్రరావు పిర్యాదు చేసాడు. పెద్దలు సమక్షంలో ఎడ్ల సుధాకర్ ను మందలించిన తనలో మార్పు రాలేదని అన్నారు.పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

# భర్తకోసం భార్య నిరసన

**మచిలీపట్నం** మచిలీపట్నంలో దారుణం జరిగింది. మహిళను రహస్య వివాహం చేసుకొని భర్త ముఖం చాటేసాడు. దాంతో న్యాయం కోరుతూ భర్త ఇంటి వద్ద మహిళ నిరసనకు దిగింది. ఆగస్టు 30వ తేదీన విజయవాడ కనకదుర్గ గుడిలో పెంకు ఫణి కుమార్ జయలక్ష్మి లకు వివాహం జరిగింది. వివాహనానంతరం మూడు స్తంభాల సెంటర్ సమీపంలోని అత్తగారి ఇంటిలో దంపతులు బస చేసారు. రహస్య వివాహ నిమిత్తం గొడవలు జరుగుతున్నాయనే నెపంతో శక్తి గుడి వద్ద ఇంటిని ఫణి కుమార్ అద్దెకు తీసుకుననారు. తరువాత భార్య జయలక్ష్మి ఇంటిలో ఒంటరిగా వదిలి ఫణి కుమార్ పరారయ్యాడు. న్యాయం కోసం అత్తారింటికి వెళితే అవమానకర రీతిలో తిట్టి దాడులు జరిపారు అంటూ జయలక్ష్మి ఆరోపించింది. తన భర్తను తనకు అప్పగించి న్యాయం చేయాలంటూ అత్తవారి ఇంటి ఎదుట జయలక్ష్మి నిరసనకు దిగింది. ఘటనపై ఫణి కుమార్ తండ్రి వివరణ ఇచ్చారు. తన కొడుకు జయలక్ష్మి కి వివాహం జరిగింది వాస్తవమే. నాలుగు రోజులు మా ఇంటిలో ఉన్న తర్వాత వేరే కాపురం నిమిత్తం బయటకు పంపాం. కొడుకు ఎక్కడికి వెళ్లాడు తెలియదు ఫోనులో మాత్రం అందుబాటులో ఉన్నాడు. వివాద విషయంలో పెద్దల సమక్షంలో చర్చలు జరిపి నిర్ణయం తీసుకుంటామని అన్నారు.

# శ్రీ తులసి ట్రావెల్ బస్సు బోల్తా




**వింజమూరు** వింజమూరు నుండి ఆత్మకూరు కి వెళ్తున్న శ్రీ తులసి ట్రావెల్ బస్సు కాశీనాయన ఆశ్రమ వద్దా అదుపుతప్పి బోల్తా పడింది. బస్సులో నలుగురు ప్రయాణికులు మాత్రమే ఉండడంతో ప్రమాదం తప్పింది. డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఎదురుగా వస్తున్న ఆటోకి సైడ్ ఇవ్వబోయి, మార్జిన్ దిగి కిందకు పడి బస్సు పడిపోయింది.

# టీటీడీ నెయ్యి కల్తీ కేసులో మరో కీలక అరెస్ట్

**తిరుమల** తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నెయ్యి కల్తీ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తును వేగవంతం చేసింది. ఈ కేసుతో సంబంధం ఉన్న సుకృతి ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రమోటర్ కైలాష్ చంద్ మంగ్లాను హైదరాబాద్ ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద ఆయనను అదుపులోకి తీసుకున్న అధికారులు, అనంతరం విశాఖపట్నంలోని పీఎంఎల్ఏ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం నిందితుడికి జ్యుడీషియల్ కస్టడీ విధించింది.టీటీడీకి సరఫరా చేసే నెయ్యిలో భారీస్థాయిలో కల్తీ జరిగిందనే ఆరోపణలతో తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ దర్యాప్తు చేపట్టింది. పామాయిల్, పామోలిన్, ఇతర రసాయనాలు కలిపి తయారు చేసిన నకిలీ నెయ్యిని, "అగ్‌మార్క్ స్పెషల్ గ్రేడ్ ఆవు నెయ్యి"గా నమ్మబలుకుతూ టీటీడీకి సరఫరా చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. 2019 నుంచి 2024 మధ్య కాలంలో సుమారు రూ. 230 కోట్ల విలువైన కల్తీ నెయ్యిని నిందితులు సరఫరా చేసినట్లు ఈడీ గుర్తించింది. ఇందులో రూ. 96 కోట్ల విలువైన కల్తీ నెయ్యిని కైలాష్ చంద్ మంగ్లా తన ఫ్యాక్టరీలో తయారు చేసినట్లు అధికారులు ధ్రువీకరించారు.ఈ కుంభకోణంలో కైలాష్ చంద్ సహ కుట్రదారుడిగా వ్యవహరించినట్లు ఈడీ ఆరోపిస్తోంది. శ్రీ వైష్ణవి డెయిరీ స్పెషాలిటీస్, మల్‌గంగా మిల్క్ అండ్ ఆగ్రో ప్రొడక్ట్స్ వంటి సంస్థల పేర్లతో ఆయన కల్తీ నెయ్యిని సరఫరా చేసినట్లు గుర్తించారు. కల్తీని కప్పిపుచ్చేందుకు, అసలైన ఆవు నెయ్యిని ఉత్పత్తి చేసినట్లుగా తప్పుడు రికార్డులను సృష్టించినట్లు ఈడీ పేర్కొంది. ఇదే కేసులో ప్రధాన సూత్రధారిగా ఉన్న విపిన్ జైన్‌ను ఈడీ అధికారులు గతంలోనే అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.

## వినాయక చవితి వేడుకల్లో
# అన్నదానం కార్యక్రమం
**- మేధా హౌసింగ్ కాలనీవాసులు**



ఘట్కేసర్ (ప్రశ్న న్యూస్) ఘట్‌కేసర్ సర్కిల్ కార్యాలయం సమీపంలోని మేధా హౌసింగ్ కాలనీవాసుల ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తిశ్రద్ధలతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించిన కాలనీవాసులను పలువురు అభినందించారు.

# గిద్దలూరుకు గుక్కెడు నీటి కష్టాలు
**- నీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారమే లక్ష్యం**
**- అధికారులతో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి కీలక భేటీ**



**గిద్దలూరు(ప్రశ్న న్యూస్)** గిద్దలూరు పట్టణంలో తీవ్రంగా నెలకొన్న నీటి ఎద్దడికి తక్షణ ఉపశమనం కల్పించడంతోపాటు శాశ్వత పరిష్కారం చూపడంపై ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి దృష్టిసారించారు. పట్టణంలో తాగునీటి సరఫరా పరిస్థితిపై మున్సిపల్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులతో శుక్రవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.
పట్టణంలోని ప్రస్తుతం నీటి సరఫరా పరిస్థితి, ట్యాంకర్ల ద్వారా అందుతున్న నీరు, ఎండిపోయిన బోర్లు, మరమ్మతులకు గురైన బోర్లు తదితర అంశాలపై అధికారులను ఎమ్మెల్యే వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏ ప్రాంతంలో నీటి సమస్య ఎక్కువగా ఉంది.. అక్కడి ప్రజలకు ప్రస్తుతం ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారనే దానిపై ఆరా తీశారు.
**ట్యాంకర్లతో తక్షణ ఉపశమనం** నీటి సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. అవసరమైన ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాను పెంచాలని సూచించారు. తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితి రాకుండా క్షేత్రస్థాయిలో అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.
**బోర్లపై ప్రత్యేక దృష్టి** పట్టణంలో ఎండిపోయిన బోర్లు, మరమ్మతులకు గురైన బోర్లను గుర్తించి వాటి వివరాలను సిద్ధం చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం ప్రజల ప్రాథమిక అవసరాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, గిద్దలూరు పట్టణంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం, అధికారులు సమన్వయంతో పనిచేస్తారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులు, టీడీపీ పట్టణ ప్రముఖులు, నాయకులు పాల్గొన్నారు.

# దసరా ఉత్సవాలకు ఇంద్రకీలాద్రి ముస్తాబు
**- క్యూలైన్లు, ఎగ్జిట్ గేట్లపై ప్రత్యేక దృష్టి**
**- ఘాట్‌రోడ్డు నుంచి అన్నప్రసాద భవనం వరకు పరిశీలించిన చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్**



**విజయవాడ(ప్రశ్న న్యూస్)** ఇంద్రకీలాద్రిపై జరగనున్న దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరమవుతున్నాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లు, ఎగ్జిట్ గేట్లు, పూజా కార్యక్రమాలు జరిగే ప్రాంతాల్లో ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. దసరా ఉత్సవాల చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్‌గా ప్రభుత్వం నియమించిన దేవాదాయశాఖ అదనపు కమిషనర్ ఎస్.ఎస్. చంద్రశేఖర్ ఆజాద్ శనివారం ఉదయం ఇంద్రకీలాద్రి ఘాట్‌రోడ్డు ఆరంభం నుంచి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయ ఈవో వెంకటేశ్వరరావు శీనా నాయక్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఎల్. రమాదేవి, బి. రాంబాబు, డి.వి. భాస్కర్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.
**క్యూలైన్లపై ప్రత్యేక పరిశీలన** దసరా ఉత్సవాల సందర్భంగా ఇంద్రకీలాద్రికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో క్యూలైన్ల నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. భక్తుల రాకపోకలకు అనుగుణంగా ఎన్ని క్యూలైన్లు ఏర్పాటు చేయాలి, వాటి మార్గం ఎలా ఉండాలి, ఎగ్జిట్ గేట్లను ఎక్కడ ఏర్పాటు చేయాలి అనే అంశాలను పరిశీలించారు.
**అన్నప్రసాద భవనం పరిశీలన** అనంతరం నూతనంగా నిర్మించిన అన్నప్రసాద భవనాన్ని అధికారులు పరిశీలించారు. దసరా ఉత్సవాల సమయంలో భక్తులకు అన్నప్రసాదం అందించేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లు, భక్తుల రాకపోకలు, భవనం వినియోగానికి సంబంధించిన అంశాలను పరిశీలించారు.

## ‘ఆయుర్మాత’ అధినేత్రి వైద్య తోవిటి దుర్గా రాణికి
# ప్రతిష్టాత్మక ‘గోల్డెన్ నంది అవార్డు’

**- ఆయుర్వేద సేవలకు అత్యున్నత గుర్తింపు**
**- ఇవాళ సురవరం ప్రతాపరెడ్డి విశ్వవిద్యాలయం వేదికగా కార్యక్రమం**
**- మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఈవెంట్**





**( తేజవ్యాస్ స్టేట్ బ్యూరో చీఫ్ )**

భారతీయ సనాతన వైద్య విధానమైన ఆయుర్వేద రంగంలో విశేష సేవలందిస్తూ, ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న ప్రముఖ నిపుణులు, ‘ఆయుర్మాత ఆయుర్వేద నిలయం’ అధినేత్రి శ్రీమతి వైద్య తోవిటి దుర్గా రాణి గారిని ప్రతిష్టాత్మక ‘గోల్డెన్ నంది అవార్డు-2026’ వరించింది. సామాజిక, సాంస్కృతిక సేవా రంగాల్లో అగ్రగామిగా నిలిచిన ‘మక్ష్ గ్లోబల్ ఫౌండేషన్’ తమ 4వ వార్షికోత్సవం సందర్భంగా ప్రతి ఏటా ఇచ్చే ఈ అరుదైన పురస్కారానికి ఆమెను ఎంపిక చేసింది.

**- సనాతన వైద్యానికి దక్కిన అసలైన గౌరవం :**

ప్రకృతి ప్రసాదించిన మూలికా వైద్య విధానాన్ని నమ్ముకుంటూ, ఎంతో మంది రోగుల దీర్ఘకాలిక వ్యాధులను నయం చేయడంలో తోవిటి దుర్గా రాణి నిరంతరం శ్రమిస్తున్నారు. ‘ఆయుర్మాత ఆయుర్వేద నిలయం’ ద్వారా ఆమె అందిస్తున్న సేవలు, సమాజ శ్రేయస్సు పట్ల ఆమెకున్న అంకితభావాన్ని గుర్తిస్తూ ఫౌండేషన్ ఈ అవార్డును ప్రకటించింది. మక్ష్ గ్లోబల్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న ఈ ‘సౌత్ ఇండియా అవార్డ్స్-2026 (సీజన్-5)’ లో ఈ పురస్కారం అందుకోనుండటం ఆయుర్వేద వైద్య రంగానికి దక్కిన గౌరవంగా వైద్య ప్రముఖులు భావిస్తున్నారు.

**- హైదరాబాద్ వేదికగా వైభవంగా అవార్డు ప్రదానోత్సవం:**

ఈ ప్రతిష్టాత్మక అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం సెప్టెంబర్ 20 (ఆదివారం) మధ్యాహ్నం 2:00 గంటల నుండి రాత్రి 9:00 గంటల వరకు హైదరాబాద్ నాంపల్లిలోని ప్రసిద్ధ ‘సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం’ వేదికగా అత్యంత వైభవంగా జరగనుంది. ఎంతో మంది రాజకీయ, సినీ, సామాజిక రంగాల ప్రముఖులు హాజరయ్యే ఈ వేడుకకు ‘మక్ష్ గ్లోబల్ నెట్‌వర్క్స్’, ‘ఎంజిఎఫ్ - టీవీ మరియు ‘ఎంజీ ఫుడ్స్’ అధికారిక మీడియా అండ్ సెలబ్రిటీ భాగస్వాములుగా వ్యవహరిస్తున్నారు.

**- వెల్లువెత్తుతున్న అభినందనలు :**

వైద్య తోవిటి దుర్గా రాణి గారికి ఈ అత్యున్నత అవార్డు దక్కడం పట్ల ఆమె వద్ద చికిత్స తీసుకున్న వారు, అభిమానులు, స్థానిక ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మానవ సేవయే పరమావధిగా భావించి ఆమె చేస్తున్న ఆయుర్వేద వైద్య సేవలు ఇలాగే నిరంతరం కొనసాగాలని, భవిష్యత్తులో ఆమె మరెన్నో ఉన్నత పురస్కారాలను అందుకోవాలని ఆకాంక్షిస్తూ పలువురు ప్రముఖులు ఆమెకు ప్రత్యేక అభినందనలు మరియు శు

# పేదల సొంతింటికి చట్టబద్ధ భరోసా
**- 28,445 మందికి ఇళ్ల పట్టాలు**
**- 400 ఎకరాలు.. రూ.8,874 కోట్ల విలువైన ఆస్తులకు హక్కులు: మంత్రి నాదెండ్ల మనోహర్**



**విశాఖపట్నం(ప్రశ్న న్యూస్)** ఏళ్ల తరబడి తాము నివసిస్తున్న ఇళ్లపై హక్కుల కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు ప్రభుత్వం భరోసా కల్పించింది. విశాఖపట్నంలో 28,445 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు, కన్వేయన్స్ డీడులు అందించే కార్యక్రమం నిర్వహించారు. సుమారు 400 ఎకరాల భూమికి సంబంధించి రూ.8,874 కోట్ల విలువైన ఆస్తులకు చట్టబద్ధ హక్కులు కల్పిస్తున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. పేదల సొంతింటి కలను సాకారం చేయడంతోపాటు సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యం ఇస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారు. విశాఖపట్నంలో నిర్వహించిన ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు.
**ఏళ్ల నిరీక్షణకు తెర..** ఇళ్ల పట్టాల పంపిణీ సాధారణ ప్రక్రియ కాదని మంత్రి పేర్కొన్నారు. అనేక సమస్యలను పరిష్కరించి, భూముల క్రమబద్ధీకరణ ప్రక్రియను పూర్తి చేసిన అనంతరం అర్హులైన లబ్ధిదారులకు హక్కులు కల్పిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు నివాసం ఉంటున్న ఇళ్లకు చట్టబద్ధ భద్రత కల్పించడం ద్వారా వారి కుటుంబాలతోపాటు భవిష్యత్ తరాలకు భరోసా కల్పించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు.
పేదల ఇళ్ల స్థలాలకు సంబంధించిన గత సమస్యలను పరిష్కరిస్తూ అర్హులైన వారికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.
**విశాఖ అభివృద్ధికి ప్రణాళికలు** సంక్షేమ కార్యక్రమాలతోపాటు విశాఖపట్నం అభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతోందని మనోహర్ చెప్పారు. కేంద్ర ప్రభుత్వం, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా గృహ నిర్మాణ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

# మోహినీ రూపంలో జగన్మోహనుడు



**తిరుమల(ప్రశ్న న్యూస్)** శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ఐదో రోజైన శనివారం ఉదయం శ్రీ మలయప్పస్వామివారు మోహినీ అవతారంలో సర్వాలంకార భూషితుడై జగన్మోహనాకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మరో తిరుచ్చిపై శ్రీకృష్ణుడు కొలువుదీరి భక్తులకు అభయమిచ్చారు.

### గజరాజులు ముందుగా నడుస్తుండగా..

భక్తబృందాల భజనలు, కోలాటాలు, జీయ్యంగార్ల ఘోష, మంగళవాయిద్యాల నడుమ మలయప్పస్వామివారి పల్లకీసేవ వైభవంగా సాగింది. మాడ వీధుల్లో అడుగడుగునా భక్తులు కర్పూరహారతులు సమర్పిస్తూ స్వామివారిని దర్శించుకున్నారు.

### మాయామోహ విమోచన సందేశం

మోహినీ అవతారంలో స్వామివారి దర్శనం మాయామోహాలను అధిగమించి భగవంతుని శరణు పొందాలనే ఆధ్యాత్మిక సందేశాన్ని అందిస్తుందని టీటీడీ తెలిపింది. భక్తి మార్గమే మాయామోహాల నుంచి విముక్తికి దారి చూపుతుందని ఈ అలంకారం చాటిచెబుతుందని పేర్కొంది.

### సాయంత్రం గరుడసేవ

బ్రహ్మోత్సవాల్లో అత్యంత విశిష్టమైన గరుడ వాహనసేవ శనివారం రాత్రి వైభవంగా నిర్వహించనున్నారు. గరుడుడు భక్తి, జ్ఞానం, వైరాగ్యాలకు ప్రతీకగా భావిస్తారు. గరుడ వాహనంపై శ్రీవారి దర్శనం కోసం భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో టీటీడీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్‌వో మురళీకృష్ణ, ఎస్వీబీసీ ఛైర్మన్ శ్రీధర్‌వర్మ, పలువురు బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

## పిఠాపురం అభివృద్ధికి
# రూ.1,500 కోట్ల పరుగులు
**- భూగర్భ డ్రైనేజీకి రూ.200 కోట్లు..**
**- గొల్లప్రోలు వాటర్ వర్క్స్‌కు రూ.80 కోట్లు**
**- ఉప్పాడ తీర రక్షణకు రూ.323 కోట్లు..**
**- రహదారులు, తాగునీరు, మత్స్యకారులు, మహిళలకు ప్రాధాన్యం**



**పిఠాపురం(ప్రశ్న న్యూస్)** పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధికి భారీ ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ నెల 21, 22 తేదీల్లో నియోజకవర్గంలో పర్యటించనుండగా.. దాదాపు రూ.1,500 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, తీర రక్షణ, మత్స్యకారుల సంక్షేమం, మహిళా సాధికారత వంటి రంగాలకు ప్రాధాన్యం ఇస్తూ పలు కీలక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టనున్నారు. పవన్ కల్యాణ్ గతంలో పిఠాపురాన్ని అభివృద్ధి చేయడంపై ప్రత్యేకంగా సమీక్షలు నిర్వహించారు; సెప్టెంబరు 11న జరిగిన సమీక్షలో పిఠాపురం మున్సిపాలిటీలో సుమారు రూ.300 కోట్లు, గొల్లప్రోలు మున్సిపాలిటీలో రూ.100 కోట్ల పనులు జరుగుతున్నట్లు అధికారులు వివరించారు.
**తాగునీటికి తొలి ప్రాధాన్యం** రెండు రోజుల పర్యటనలో భాగంగా ఉప్పాడ కొత్తపల్లి, పిఠాపురం రూరల్ మండలాల పరిధిలోని సుమారు 52 ఆవాసాల్లో 97 వేల మందికి తాగునీరు అందించేలా ఆధునీకరించిన నాగులాపల్లి సమగ్ర రక్షిత మంచినీటి సరఫరా పథకాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు. దాదాపు మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ పథకం ద్వారా చివరి గ్రామాలకు పూర్తిస్థాయిలో నీరు అందకపోవడాన్ని గుర్తించి రూ.9.59 కోట్లతో ఆధునీకరణ పనులు చేపట్టినట్లు ప్రభుత్వం తెలిపింది. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందులకు పరిష్కారం చూపడంలో ఈ పథకం కీలకంగా మారనుంది.
**పట్టణానికి భూగర్భ డ్రైనేజీ** పిఠాపురం పట్టణ ప్రజల చిరకాల సమస్యగా ఉన్న మురుగునీటి పారుదల వ్యవస్థకు శాశ్వత పరిష్కారం దిశగా రూ.200 కోట్లతో సమగ్ర భూగర్భ డ్రైనేజీ పథకానికి శ్రీకారం చుట్టనున్నారు. ఇందులో మురుగునీటి పైపులైన్లతోపాటు అవసరమైన శుద్ధి కేంద్రాలు, పంపింగ్ స్టేషన్లు తదితర అనుబంధ పనులు కూడా ఉండనున్నాయి. పిఠాపురం మున్సిపాలిటీ కోసం రూ.200 కోట్ల అంచనా వ్యయంతో సమగ్ర అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ డీపీఆర్ తయారీకి ఇటీవల టెండర్ ప్రక్రియ కూడా చేపట్టినట్లు రికార్డులు చూపుతున్నాయి. మురుగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తే పట్టణ పారిశుద్ధ్యం మెరుగుపడటంతోపాటు ప్రజారోగ్య పరిరక్షణకు కూడా దోహదపడనుంది. ఇటీవలే పిఠాపురం నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులపై పవన్ కల్యాణ్ అధికారులతో సమీక్ష నిర్వహించి, పెండింగ్ పనులకు పరిపాలనా, సాంకేతిక అనుమతులు పూర్తి చేసి నిర్ణీత గడువుల్లో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

## కుటుంబ సమేతంగా దుర్గమ్మను దర్శించుకున్న: సీపీ
**- పోలీసు కమిషనర్ రాజశేఖర్‌బాబుకు వేదపండితుల ఆశీర్వచనం**



**విజయవాడ(ప్రశ్న న్యూస్)** ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు శనివారం సాయంత్రం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు దేవస్థానం అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్న అనంతరం వేదపండితులు సీపీ దంపతులకు వేద ఆశీర్వచనం అందించారు. అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థానం చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ) సీపీ రాజశేఖర్‌బాబు దంపతులకు శ్రీ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. దసరా నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపై కొనసాగుతున్న ఏర్పాట్లు, భద్రతా చర్యలపై కూడా అధికారుల మధ్య చర్చ జరిగినట్లు తెలిసింది. అమ్మవారి దర్శనం అనంతరం సీపీ కుటుంబ సభ్యులతో కలిసి ఆలయం నుంచి బయటకు వచ్చారు. ఆలయ పరిసరాల్లో భక్తుల రద్దీ నేపథ్యంలో పోలీసులు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# వాళ్లకు వేల ఎకరాలు..
# వీళ్లకు వందల ఎకరాలు

## వాళ్లకు వేల కోట్లు.. వీళ్లకు వందల కోట్లు
## జర్నలిస్టుల గూడు(ఇంటి) కోసం యూనియన్లు గళం విప్పాలి
## వార్త మల్లేష్ సీనియర్ జర్నలిస్ట్



**(ఆర్ కె -ప్రశ్న న్యూస్ బ్యూరో)**

తెలంగాణ ఉద్యమంలో తమ కలంతో, కెమెరాలతో ప్రజల పక్షాన నిలిచిన జర్నలిస్టుల జీవితాల్లో మాత్రం ఇంకా సొంతింటి కల నెరవేరని పరిస్థితి ఎందుకు కొనసాగుతోంది.? రాష్ట్రం ఏర్పడి సంవత్సరాలు గడుస్తున్నా జర్నలిస్టుల గూడు(ఇంటి) సమస్యకు శాశ్వత పరిష్కారం ఎందుకు లభించలేదన్న ప్రశ్నలు ఇప్పుడు బలంగా వినిపిస్తున్నాయి. వేల ఎకరాల భూములు ఎవరి చేతుల్లోకి వెళ్లాయి.? వందల ఎకరాల భూములపై ఎవరి హక్కులు ఏర్పడ్డాయి.? కోట్లాది రూపాయల విలువైన ఆస్తులు ఎలా కూడబెట్టబడ్డాయి.? వంటి అంశాలపై వార్తలు రాసిన జర్నలిస్టులు మాత్రం కనీసం వంద గజాల ఇంటి స్థలం కోసం ఎందుకు ఎదురుచూడాల్సి వస్తోందని సీనియర్ జర్నలిస్టు మల్లేష్ ప్రశ్నిస్తున్నారు. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, అవినీతి,అక్రమాలను ప్రశ్నించడం, ప్రభుత్వాలను నిలదీయడం జర్నలిస్టుల బాధ్యత. అయితే అదే జర్నలిస్టుల కుటుంబాలకు సొంత గూడు లేకపోతే వారి సమస్యను ఎవరు ప్రశ్నించాలి.? ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంటుంది.

### యూనియన్లు ఏం చేస్తున్నాయి.?

జర్నలిస్టుల సంక్షేమం కోసం ఏర్పడిన సంఘాలు, యూనియన్లు ఈ అంశంపై మరింత ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొంతమంది జర్నలిస్టులకు విల్లాలు, ఫ్లాట్లు, ఇతర ప్రయోజనాలు అందుతున్నాయనే చర్చల మధ్య సాధారణ జర్నలిస్టులు, ఫ్రీలాన్స్ రిపోర్టర్లు, చిన్న పత్రికల్లో పనిచేసే వారికి సొంతింటి స్థలం ఎప్పుడు అనే ప్రశ్నకు సమాధానం కావాలన్నారు. జర్నలిస్టుల పేరుతో వచ్చిన సంక్షేమ పథకాలు, భూములు, ఇళ్ల కేటాయింపులు, ఇతర ప్రయోజనాలపై పూర్తి పారదర్శకత ఉండాలని మల్లేష్ కోరారు. ఎవరికెంత లబ్ధి చేకూరింది.? అర్హతలు ఏమిటి.? ఎవరు మిగిలిపోయారు.? అన్న వివరాలను బహిరంగపరచాల్సిన అవసరం ఉందన్నారు.

### భూముల్లో 10 శాతం జర్నలిస్టులకు ఇవ్వలేరా.?

ప్రభుత్వ భూములు, భూ కేటాయింపులు, పునర్విభజనలు వంటి అంశాలపై ప్రభుత్వం నిర్ణయాలు తీసుకునే సమయంలో జర్నలిస్టుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని మల్లేష్ డిమాండ్ చేశారు. వివాదాస్పదంగా మారిన భూములపై హక్కుల విషయాన్ని నిర్ధారించే ముందు చట్టపరమైన పరిశీలన అవసరమే అయిన అర్హులైన జర్నలిస్టులకు గృహ స్థలాల కోసం ప్రత్యేక విధానం ఎందుకు రూపొందించకూడదన్న ప్రశ్నకు ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాత్ర పోషించిన జర్నలిస్టులతో పాటు ప్రస్తుతం చిన్న పత్రికలు, ఫ్రీలాన్స్ రంగంలో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులను గుర్తించి, పారదర్శకమైన విధానంలో ఇంటి స్థలం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జర్నలిస్టు వర్గాలు కోరుతున్నయన్నారు.

### ఇప్పటికైనా ఐక్యంగా గళం విప్పాలి

జర్నలిస్టుల సంఘాల మధ్య విభేదాలు, వ్యక్తిగత ప్రయోజనాలు పక్కనపెట్టి సాధారణ జర్నలిస్టుల గూడు(ఇంటి) కోసం ఐక్య పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.వాళ్లకు వేల ఎకరాలు ఉంటే.. మాకు వంద గజాల ఇల్లు ఇవ్వలేరా.? అనే ప్రశ్న ఇప్పుడు జర్నలిస్టుల వర్గాల్లో చర్చనీయాంశంగా మారుతోంది. కొంత మందిజర్నలిస్టుల ఆస్తులు, యూనియన్ల కార్యకలాపాలపై ఆరోపణలు ఉంటే అవి ఆధారాలతో పరిశీలించాలి. అదే సమయంలో జర్నలిస్టుల సంక్షేమం పేరుతో పనిచేస్తున్న సంఘాలు తమ కార్యకలాపాలు, నిధులు, లబ్ధిదారుల ఎంపికలో పూర్తి పారదర్శకత పాటించాల్సిన అవసరం ఉందన్నారు.అభాగ్య జర్నలిస్టుల గూడు కోసం ఇప్పటికైన యూనియన్లు నోరు విప్పాలని సొంతింటి కోసం పోరాటం మొదలుపెట్టాలన్నారుఇది ఎవరి వ్యక్తిగత డిమాండ్ కాదని జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన సామూహిక ప్రశ్న అని సీనియర్ జర్నలిస్ట్ మల్లేష్ పేర్కొన్నారు.

# భైక్ బజార్ల దోపిడీ.. వినియోగదారుల విలవిల

- నాసిరకం రిపేర్లు.. పాత భైక్‌లకు కొత్త రంగులు
- అధిక వడ్డీ ఫైనాన్స్‌తో నిలువు దోపిడీ ఆరోపణలు
- ఈఎంఐ ఆలస్యమైతే బెదిరింపులు.. రోడ్డుపైనే సీజింగ్ హంగామా
- సెటిల్మెంట్ పేరుతో వాహనం తీసుకుని తక్కువ మొత్తానికి మోసం చేస్తున్నారన్న ఆరోపణలు

ఎల్బీనగర్ (ప్రశ్న న్యూస్) ఎల్బీనగర్ పరిధిలో కొన్ని బైక్ బజార్లు, వాటికి అనుబంధంగా పనిచేస్తున్న ఫైనాన్స్ వ్యవహారాలపై వినియోగదారుల నుంచి తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాత ద్విచక్ర వాహనాలను నాసిరకంగా మరమ్మతులు చేసి, బయటకు కొత్తవాటిలా కనిపించేలా చేసి విక్రయించడమే లక్ష్యంగా కొన్ని వ్యాపారాలు సాగుతున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాహనం కొనుగోలు చేసేందుకు వచ్చే సామాన్యులను లక్ష్యంగా చేసుకుని అధిక వడ్డీతో ఫైనాన్స్ చేసి ఆర్థికంగా భారాన్ని మోపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఒకటి, రెండు ఈఎంఐలు ఆలస్యమైనా ఫైనాన్స్ సిబ్బంది పేరుతో కొందరు బెదిరింపులకు పాల్పడుతున్నారని, దాడులకు దిగుతున్నారని, వాహనాలను బలవంతంగా తీసుకెళ్తున్నారని పలువురు వినియోగదారులు ఆరోపిస్తున్నారు.




### రోడ్డుపైనే ‘సీజింగ్’ హంగామా.?

వాహనం సీజ్ చేయాలనే పేరుతో ఐదు నుంచి పది మంది వరకు వ్యక్తులు రోడ్లపై గుంపుగా నిలబడి వాహనదారులను అడ్డుకుని, రౌడీలవలె వ్యవహరిస్తూ దౌర్జన్యంగా వాహనాలను లాక్కెళు_న్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని చెబుతున్నారు. చట్టబద్ధమైన రికవరీ ప్రక్రియకు బదులుగా రోడ్డుపైనే దౌర్జన్యం చేసి బలవంతపు సీజింగ్ చేయడం ఎంతవరకు సమంజసమన్న వినియోగదారుల నుండి ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### ‘సెటిల్మెంట్’ పేరుతో మరో దోపిడీ.?

ఈఎంఐలు చెల్లించలేని పరిస్థితుల్లో వినియోగదారులతో సెటిల్మెంట్ పేరుతో వాహనాలను తీసుకుని, వాటి విలువకు




పూర్తిగా తగిన మొత్తాన్ని చెల్లించకుండా తక్కువ డబ్బుతో వ్యవహారం ముగిస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. వాహనం మార్కెట్ విలువ, ఇప్పటికే చెల్లించిన ఈఎంఐలు, బకాయిల వివరాలను పారదర్శకంగా చూపకుండా వినియోగదారులను ఒత్తిడికి గురిచేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. సామాన్యుల ఆర్థిక పరిస్థితులను ఆసరాగా చేసుకుని వాహన విక్రయాలు, ఫైనాన్స్, సీజింగ్ పేరుతో ఎవరైనా అక్రమాలకు పాల్పడుతున్నారా అనే అంశంపై అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. ఎల్బీనగర్‌లోని బైక్ బజార్లు, అనుబంధ ఫైనాన్స్ సంస్థలపై రవాణా, పోలీస్, వినియోగదారుల పరిరక్షణ, సంబంధిత నియంత్రణ సంస్థలు దృష్టి సారించాలి. నాసిరకం వాహనాల విక్రయాలు, అధిక వడ్డీ, బెదిరింపులు, దౌర్జన్యపు సీజింగ్ వంటి ఆరోపణలు పై అధికారులు పూర్తిస్థాయి విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

# స్వచ్ఛ సాగరం.. 1,200 టన్నుల ప్లాస్టిక్ తొలగింపు

## ఆర్‌కే బీచ్‌లో సాగర స్వచ్ఛతను పరిశీలించిన : సీఎం చంద్రబాబు

విశాఖపట్నం(ప్రశ్న న్యూస్) సాగర తీర పరిశుభ్రతకు పెద్దపీట వేస్తూ విశాఖలో చేపట్టిన స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆర్‌కే బీచ్‌లో సాగర స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొని సముద్ర వ్యర్థాల తొలగింపు ప్రక్రియను పరిశీలించారు. పెదజాలరిపేటలో ఏర్పాటు చేసిన ఓషన్ ప్లాస్టిక్ రికవరీ సెంటర్ పైలట్ సైట్‌ను సీఎం వర్చువల్‌గా ప్రారంభించారు. సముద్ర వ్యర్థాల సేకరణలో పాల్గొంటున్న పారిశుద్ధ్య కార్మికులు, మత్స్యకారులు, స్కూబా డైవర్లతో ముఖాముఖి మాట్లాడారు.

### ప్లాస్టిక్‌తో అదనపు ఆదాయం


చేపల వేటతోపాటు సముద్రంలో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించడం ద్వారా ప్రోత్సాహకాలు అందుతున్నాయని, దీంతో అదనపు ఆదాయం లభిస్తోందని మత్స్యకారులు సీఎంకు వివరించారు. సముద్ర ఉపరితలం నుంచి సేకరించిన వ్యర్థాలను డిజిటల్ తూకం వేసే విధానాన్ని చంద్రబాబు పరిశీలించారు. ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణకు సంబంధించిన ప్రోత్సాహకాన్ని మత్స్యకారులకు అందజేశారు.
సముద్ర గర్భంలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, పాత



వలలను స్కూబా డైవర్లు తొలగిస్తున్న విధానాన్ని సీఎం అడిగి తెలుసుకున్నారు. సాగర స్వచ్ఛతలో భాగంగా 1,200 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు సీఎంకు వివరించారు.

### సీవరేజ్ రోబో పరిశీలన

మ్యాన్‌హోళ్లు, మురుగుకాల్వల శుభ్రత కోసం జీవీఎంసీ అందుబాటులోకి తెచ్చిన ఆధునిక సీవరేజ్ రోబో పనితీరును చంద్రబాబు పరిశీలించారు. సాగర స్వచ్ఛత ప్రాజెక్టుకు లభించిన అంతర్జాతీయ గుర్తింపు, భవిష్యత్తు లక్ష్యాలపై బ్లూమ్‌బెర్గ్



ప్రతినిధులతో చర్చించారు.

### మురిమిక్చర్.. ఆపై పెన్షన్

సాగర తీరంలో మురిమిక్చర్ విక్రయిస్తున్న మహిళను చంద్రబాబు పలకరించి ఆమె జీవనోపాధి గురించి ఆరా తీశారు. ఆమె విక్రయించిన మురిమిక్చర్‌ను స్వయంగా రుచి చూశారు. ఆమె ఒంటరి మహిళ అని తెలుసుకున్న సీఎం.. పెన్షన్ మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు.

# కొండపోచమ్మ టెంపుల్ వద్ద ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

## పట్టించుకోని విద్యుత్ అధికారులు.. ఆందోళనలో స్థానికులు



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) జగదేవ్‌పూర్ మండలంలోని కొండపోచమ్మ ఆలయం వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఏర్పాటు చేయడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇనుప స్టాండ్‌పై ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భక్తులు, స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.ప్రతిరోజూ భక్తులు, ప్రజలు రాకపోకలు సాగించే ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు సరైన రక్షణ చర్యలు చేపట్టకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ తగిన భద్రతా ఏర్పాట్లు లేకపోవడంతో ప్రమాదం జరిగే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ సమస్యను పలుమార్లు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను సురక్షితమైన ప్రదేశానికి తరలించడంతో పాటు, చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేసి అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు. ప్రమాదం జరిగే వరకు అధికారులు వేచి చూడకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.


# భారత యువత సత్తాకు స్టార్టప్‌లే నిదర్శనం

- 20వ రోజ్‌గార్ మేళాలో 51,000 మందికి పైగా నియామక పత్రాల పంపిణీ



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశ యువత సామర్థ్యానికి, వారి సత్తాకు దేశంలోని స్టార్టప్ పర్యావరణ వ్యవస్థే ఒక గొప్ప ఉదాహరణ అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఒకప్పుడు కేవలం పెద్ద నగరాలకే పరిమితమైన స్టార్టప్‌ల కథ ఇప్పుడు చిన్న పట్టణాలకు, నగరాలకు కూడా విస్తరించిందని ఆయన పేర్కొన్నారు. 20వ రోజ్‌గార్ మేళా సందర్భంగా శనివారం ఆయన వివిధ ప్రభుత్వ సంస్థలకు కొత్తగా ఎంపికైన యువతను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల నుంచి 51,000 మందికి పైగా యువతకు నియామక పత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ “భారతదేశం నేడు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా నిలిచింది. గుర్తించబడిన స్టార్టప్‌లలో దాదాపు సగం టైర్-2, టైర్-3 నగరాల్లోనే ఉన్నాయి. ఇది భారతదేశ నూతన ఆర్థిక వ్యవస్థలో గ్రామాలు, పట్టణాలు, చిన్న నగరాల నుంచి వచ్చిన యువత కూడా కీలక పాత్ర పోషిస్తున్నారని చూపిస్తోంది” అని వివరించారు. చిన్న పట్టణాలకు చెందిన యువత తమ సొంత ఆలోచనలతో కొత్త కంపెనీలను స్థాపిస్తూ, తమతో పాటు ఇతర యువతకు ఉపాధి అవకాశాలను సృష్టిస్తున్నారని ప్రశంసించారు. ప్రభుత్వ రంగంతో పాటు ప్రైవేటు రంగంలోనూ ఉపాధి అవకాశాలను వేగంగా విస్తరించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మోదీ స్పష్టం చేశారు.“ఈ లక్ష్యంతోనే సుమారు రూ. 1 లక్ష కోట్లతో ‘ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన’ను ప్రారంభించాం. ఈ పథకం ద్వారా దాదాపు 2 కోట్ల మంది యువత తొలిసారిగా ఉద్యోగ రంగంలోకి ప్రవేశించే అవకాశం లభిస్తుంది. మొదటిసారి ఉద్యోగంలో చేరేవారికి రూ. 15,000 వరకు ప్రోత్సాహకం అందించడంతో పాటు, కొత్త ఉద్యోగాలను సృష్టించే యాజమాన్యాలకు కూడా ప్రోత్సాహకాలు ఉంటాయి” అని తెలిపారు. ప్రభుత్వ వ్యవస్థలో భాగం కాబోతున్న నూతన ఉద్యోగులకు ప్రధాని కీలక సూచనలు చేశారు. “మీరు, మీ తల్లిదండ్రులు ఎదుర్కొన్న ఇబ్బందులు, కష్టాలు దేశంలోని ఏ పౌరుడూ ఎదుర్కోకుండా చూడటమే మీ లక్ష్యం కావాలి. ప్రభుత్వ సేవలో చేరిన వెంటనే ఈ మిషన్‌ను మీరు చేపట్టాలి” అని పిలుపునిచ్చారు.నిరంతరం నేర్చుకోవడం, కొత్త నైపుణ్యాలు, టెక్నాలజీని అందిపుచ్చుకోవడం చాలా ముఖ్యమని ఆయన అన్నారు. ఇందుకోసం ‘మిషన్ కర్మయోగి’ని రూపొందించినట్లు తెలిపారు. ఇప్పటికే 1.70 కోట్ల మంది ప్రభుత్వ ఉద్యోగులు ‘ఐగాట్ కర్మయోగి’ ప్లాట్‌ఫామ్‌లో చేరారని, కొత్తగా చేరే వారి కోసం ‘కర్మయోగి ప్రారంభ్’ అనే ప్రత్యేక కార్యక్రమాన్ని సిద్ధం చేశామని వివరించారు. మీరు మిమ్మల్ని ఎంతగా మెరుగుపరుచుకుంటే, దేశ పౌరులకు అంత మెరుగైన సేవలు అందించగలరని ప్రధాని పేర్కొన్నారు.

# తెలంగాణలో మళ్లీ కుండపోత.. అల్పపీడనంతో అతిభారీ వర్ష సూచన!



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో వర్షాలు మళ్లీ జోరందుకున్నాయి. నిన్నటి నుంచి రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు దంచికొడుతున్నాయి. ముఖ్యంగా దక్షిణ తెలంగాణ జిల్లాలైన మహబూబ్‌నగర్, వనపర్తి, జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్, నారాయణపేటలో కుండపోత వానలు పడుతున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, ములుగులో ప్రారంభమైన వానలు.. జయశంకర్ భూపాలపల్లి, హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాలకూ విస్తరించాయి. రానున్న కొన్ని గంటల్లో వర్షాల తీవ్రత పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ నిపుణులు సూచిస్తున్నారు.మరోవైపు, రెండు రోజులుగా విరామం ఇచ్చిన వానలు శనివారం సాయంత్రం హైదరాబాద్‌ను ముంచెత్తాయి. నగరం యొక్క దక్షిణ, మధ్య ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. హయత్‌నగర్‌లో అత్యధికంగా 63.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్‌జీఐఏ) పరిసరాల్లో 59.5, రాజేంద్రనగర్‌లో 44.3, శివరాంపల్లిలో 44 మిల్లీమీటర్ల వర్షం పడింది. అయితే, నగరంలోని అన్ని ప్రాంతాల్లో వర్ష తీవ్రత ఒకేలా లేదు. రాబోయే నాలుగైదు రోజులు హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉరుములతో కూడిన వర్షాలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.ఈ నేపథ్యంలో తెలంగాణకు మరో అల్పపీడనం ముప్పు పొంచి ఉంది. సెప్టెంబర్ 23-25 మధ్య బంగాళాఖాతంలో ఏర్పడే అల్పపీడనం రాష్ట్రంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఈ అల్పపీడనం ఉత్తర ఆంధ్రప్రదేశ్--దక్షిణ ఒడిశా తీరం వైపుగా పయనిస్తే తెలంగాణలో వర్షాలు మరింత తీవ్రరూపం దాల్చవచ్చు. దీని ప్రభావంతో ఉత్తర, తూర్పు, మధ్య తెలంగాణలో భారీ నుంచి అతిభారీ వర్షాలు, దక్షిణ, పశ్చిమ ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భావిస్తున్నారు. అయితే, అల్పపీడనం దిశను బట్టి వర్షపాతం విస్తరణలో మార్పులు ఉండొచ్చని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588